

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 10.06.2026 | సంపుటి: 3 | సంచిక: 128 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 10.06.2026 | V0LUME : 3 | ISSUE : 128 | PAGES: 8 | COST: 2/- |

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

# కేబినెట్ కసరత్తుతో కాంగ్రెస్‌లో కలకలం



- ఢిల్లీ బాట పట్టిన ఆశావహులు.. పెరుగుతున్న లాబీయింగ్
- రాహుల్‌ను కలిసిన రాజగోపాల్ రెడ్డి
- మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న సీనియర్ నేత
- సామాజిక సమీకరణాలే అధిష్ఠానానికి సవాల్
- అసంతృప్తి స్వరాలు పెరగకుండా జాగ్రత్తలు
- కర్ణాటక అనుభవంతో అప్రమత్తమైన కాంగ్రెస్
- తెలంగాణలో ఆచితూచి అడుగులు వేస్తున్న హైకమాండ్

**హైదరాబాద్, జూన్ 9( రాజముద్ర న్యూస్):** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు వ్యవహారాన్ని కాంగ్రెస్ అధిష్టానం ముగించినప్పటికీ అక్కడి అసంతృప్తి పూర్తిగా చల్లారలేదనే చర్చ కొనసాగుతోంది. ఇదే సమయంలో తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ అంశాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు అంశం ప్రస్తుతం లేదనే సంకేతాలు ఉన్నా, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణకు త్వరలోనే గ్రీన్ సిగ్నల్ లభించే అవకాశం ఉందన్న ప్రచారం జోరందుకుంది. దీంతో మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న సీనియర్ నేతలు,

మిగతా 2వ పేజీలో..



# మహిళా సాధికారతకు మరో అడుగు

మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ

- ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట
- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు
- మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫ్యామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు
- కెసిఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బిజెపి కనీసం మహిళకు అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- పరేడ్ గ్రౌండ్స్ సభలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూన్9( రాజముద్ర న్యూస్):** మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది

మిగతా 3వ పేజీలో..



# ప్రజల కోసం పనిచేసే ఇందిరమ్మ రాజ్యం

- పదేళ్లలో రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పులపాలు చేశారు
- డిస్కంలను ముంచేసి ఇప్పుడు కల్లాల్లోకి వస్తామంటారా?
- ధాన్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రం ఎందుకు కొనడం లేదు?
- హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తున్నారు
- త్వరలో 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా
- ఒకే విడతలో రూ.22 వేల కోట్ల రైతు రుణ మాఫీ
- 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధికి రూ.60 కోట్లతో విద్యుత్ పనులు
- బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 9( రాజముద్ర న్యూస్) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్ష బీఆరఎస్‌లు కుమ్మక్కై రైతులను, ప్రజలను వంచిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం పల్లగుట్ట గ్రామంలో మంగళవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమ

మిగతా 2వ పేజీలో..

# ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించండి



- బీఆర్ఎస్ లీడర్ హరీశ్ రావు

**హైదరాబాద్, జూన్ 9( రాజముద్ర న్యూస్) :** మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డి.. ముందు అంగన్‌వాడీలకు జీతాలు చెల్లించి, మహిళల పట్ల గౌరవాన్ని నిలబెట్టుకో అని అసెంబ్లీలో బీఆర్ఎస్

మిగతా 2వ పేజీలో..



# హైదరాబాద్ అతలాకుతలం!

- మంగళవారం సాయంత్రం భారీ వర్షం
- నేలకొరిగిన చెట్లు.. భారీగా ట్రాఫిక్ ఇక్కట్లు
- విద్యుత్ షాక్ తో ఇరువురి మృతి
- గచ్చిబౌలి లో చెరువును తలపించిన రోడ్లు!

2

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు



- మరోమారు కేంద్రానికి లేఖ రాస్తా
- 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కొనుగోలు
- హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి
- ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహి విమర్శలు
- మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయన్న ఎన్‌డీఎసఏ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,జూన్ 9( రాజముద్ర న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్ఠాగోష్టిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల

మిగతా 2వ పేజీలో..



# ప్రజా నమ్మకమే ఈ ప్రభుత్వ బలం

3

- పాలేరు నియోజకవర్గంలో 'ప్రజా దర్బార్' విజయవంతం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి



# మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేని బిఆరఎస్

- ఫ్రీ బస్సు తీసుకొస్తే కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు
- మంత్రి సీతక్క ఘాటు విమర్శలు

3




# జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు బండి సంజయ్ దూరమా?

- ప్రచార బాధ్యతలపై కమలం పార్టీలో చర్చ
- హైదరాబాద్ నేతలతో కనిపించని సఖ్యత
- ఎన్నికలకు పూర్తిగా దూరమైతే సెల్ఫ్ ఇమేజ్ డ్యామేజ్ అవుతుందని భావన
- వరంగల్‌పైనే ఆసక్తి చూపుతున్న కేంద్ర మంత్రి?

3

# మైనారిటీల ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్
- చరిత్రాత్మక మెగా జాబ్ మేళా ఘనంగా ప్రారంభం



**హైదరాబాద్, జూన్ 9 ( రాజముద్ర న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మైనారిటీల సంక్షేమ శాఖ, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్(టీజీఎంఎఫ్‌సీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలోని రెడ్ రోజ్ ప్యాలెస్‌లో మెగా

మిగతా 3వ పేజీలో..



# ఆదాయానికి మించి 300శాతం ఆస్తులు!

- ఏసీబీ వలలో ఆర్అండ్‌బీ అధికారి మోహన్ నాయక్
- మియాపూర్‌లోని ఇంట్లో రూ. 65 లక్షల నగదు, బంగారు బిస్కెట్లు లభ్యం

2



## బాసర గోదావరిలో ముగ్గురి గల్లంతు

**నిర్మల్,జూన9**

నిర్మల్ జిల్లా బాసరలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తూ మంగళవారం గల్లంతయ్యారు. సాయంత్రం వారి మృతదేహాలు బయట పడ్డాయి. ఈ ఘటనతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌లోని కాచిగూడ చప్పల్ బజార్ ప్రాంతానికి చెందిన కుటుంబ సభ్యులు బాసరలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనం కోసం ఇవాళ వచ్చారు. దర్శనానికి ముందు గోదావరి నదిలో పుణ్యస్నానం చేస్తుండగా ముగ్గురు సోదరులు నీటిలో మునిగిపోయారు. మాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ బృందాలు, గజ ఈతగాళ్లతో రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టాయి. కొన్ని గంటల పాటు గాలించాక.. ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు గజ ఈతగాళ్లు. మృతులను చెందిన చంద్రశేఖర్ (38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31)గా గుర్తించారు. ముగ్గురూ సొంత అన్నదమ్ములేనని అధికారులు తెలిపారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరులు ఒకేసారి మృతిచెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన బాసర, కాచిగూడలో తీవ్ర విషాద ఛాయలు నింపగా, స్థానికులను కూడా కలచివేసింది. గోదావరి నదిలో స్నానాలు చేసే సమయంలో భక్తులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, లోతైన ప్రాంతాలకు వెళ్లవద్దని పోలీసులు సూచించారు.

### ముందు అంగన్‌వాడీలకు
## జీతాలు చెల్లించండి

**మొదటిపేజీ తరువాయి**

డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు డిమాండ్ చేశారు. రెండు నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 62వేల మంది అంగన్‌వాడీల కష్టాలు మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నెలలతరబడి జీతాలు ఇవ్వకుండా అంగన్‌వాడీలను వేధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి ఉసురు తప్పకుండా తగులుతుందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సీతక్క సాటి మహిళల కన్నీటి గోస అర్థం చేసుకోకపోవడం శోచనీయమన్నారు. అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్‌వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించారని, వారి గౌరవాన్ని పెంచారని గుర్తు చేశారు. 2014 నాటికి ఆ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ బీఆరఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.13,650లకు, మినీ అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.7,800లకు, అంగన్‌వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800 లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించామన్నారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.18,000లకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకొచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారని, కానీ రెండున్నరేండ్లు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీగతీ లేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రెటేరియట్‌కు పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి కర్కశంగా వ్యవహరించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరవండి.. మీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ఛీకొడుతున్నారన్న విషయాన్ని గుర్తించండని హితవు పలికారు. అంగన్‌వాడీల వేతనాలను చెల్లించాలని, అప్ గ్రేడ్ చేసిన మినీ అంగన్‌వాడీలకు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న పెంచిన వేతనాలను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీష్‌రావు అన్నారు.



## హైదరాబాద్ అతలాకుతం !

**తెలంగాణ బ్యూరో, జూన్ 9:**

హైదరాబాద్ మహానగరంలో మంగళవారం ఆకస్మికంగా కురిసిన వర్షం నగరవాసులను ఇబ్బందుల పాలు చేసింది. విద్యానగర్, కాచిగూడ, గచ్చిబౌలి,ఐకియా సర్కిల్ తదితర ప్రాంతాలలో వర్షం మూలంగా భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. దింతో గంటల తరబడి ప్రజలు ట్రాఫిక్లో చిక్కుకోవాల్సి వచ్చింది.

**చెరువును తలపించిన గచ్చిబౌలి రోడ్లు!**


గచ్చిబౌలి ప్రాంతంలో మంగళవారం వర్షం భారీగా కురియడంతో రోడ్లు చెరువులను తలపించాయి.వాహన దారులు కాలువల పైనుండి ప్రయాణం చేయాల్సి వచ్చింది.చాల చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

**పాతబస్తీలో ఇద్దరు మృతి**

హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో ఇద్దరు యువకులు షార్ట్ సర్క్యూట్ వల్ల చనిపోయారు. ఎల్టీ ఏబీ కేబుల్ వర్షానికి జారీ వారి పైన పడటంతో మృతిచెందినట్టు అధికారులు తెలిపారు. జాఫర్ (25 )స్పాట్ లోనే చనిపోయాడు అబూ (16 )ఒవైసీ ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్టు అధికారులు తెలిపారు.

**గంటల తరబడి ట్రాఫిక్ లోనే !**

అనుకోకుండా కురిసిన వర్షం మూలంగా హైదెరాబాద్ లోని చాల ప్రాంతాల్లో భారీగానే వర్షం కురిసింది. దింతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాల చోట్ల గంటల తరబడి రోడ్లపైనే ఉండాలి వచ్చింది. కొన్ని ప్రాంతాలలో ఐతే ట్రాఫిక్ లో చిక్కుకొని జనం విలవిల్లాడారు. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అయ్యింది. దాదాపు ప్రధాన కూడళ్ల వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ క్లియర్ చేయడానికి పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.



# ప్రజల కోసం పనిచేసే 'ఇందిరమ్మ రాజ్యం'

**మొదటిపేజీ తరువాయి**



ప్రభుత్వం చేస్తోన్న రికార్డు స్థాయి ధాన్యపు కొనుగోళ్లు, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. బీఆరఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిప్పులు చెరిగారు. గత బీఆరఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రాష్ట్ర సంపదను, వనరులను విచ్చలవిడిగా దోపిడీ చేసిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వెళ్లారు. ఆ పాపానికి ఇప్పుడు తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ.76 వేల కోట్లను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు కట్టాల్సి వస్తోంది. ఆ అప్పులే లేకపోయి ఉంటే ఈ రూ.76 వేల కోట్లను ప్రజల సంక్షేమానికి అందించి రాష్ట్ర దశ, దిశ మార్చేవాళ్లం అని అన్నారు. పేదల సొమ్మంతా గత పాలకుల ఇళ్లకే పోయిందని, అందుకే పదేళ్లలో పేదలకు సన్న బియ్యం గానీ, ఇందిరమ్మ ఇళ్లు గానీ ఇవ్వలేకపోయారని ఎద్దేవా చేశారు.

**డిస్కంలను ముంచేసింది మీరు కాదా?**

పదేళ్లపాటు ఉచిత కరెంట్ ఇస్తున్నామని బీఆరఎస్ నేతలు గప్పాలు కొట్టుకున్నారే తప్ప డిస్కంలకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా వాటిని అప్పుల పాలు చేశారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. మీరు చేసిన తప్పుల వల్ల డిస్కంలు ఆదాయం లేక, క్వాలిటీ పవర్ ఇవ్వలేక ఇబ్బందిపడ్డాయన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక రైతులు కట్టాల్సిన రూ.14 వేల కోట్లను, పేదల ఉచిత కరెంట్ (గృహజ్యోతి) బిల్లు రూ.5 వేల కోట్లను.. మొత్తంగా రూ.19 వేల కోట్లను ప్రతి నెలా నేరుగా డిస్కంలకు చెల్లిస్తూ క్వాలిటీ పవర్ ఇస్తున్నామని చెప్పారు.. దీనిపై కూడా అభాండాలు వేయడం బీఆరఎస్ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు.

**హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తున్నారు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ కేబినెట్ రోజుకు 18 గంటలు ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తుంటే పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కేవలం వార్తల్లో ఉండటం కోసం రోజుకొక అబద్ధపు వార్తను సృష్టిస్తున్నారు. గాలి కబుర్లు పోగేసి ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలుతున్నారు. అధికారం పోవడంతో తట్టుకోలేక కట్టుకథలు అల్లుతున్నారు అని భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రైతులను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసిన బీజేపీ**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైతులను కార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద వదిలేయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం మరి రాష్ట్రాలు కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎఫ్‌సిఐ ద్వారా ఎందుకు సేకరించడం లేదని ప్రశ్నించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రమే కొనుగోలు చేసేదని, ఇప్పుడెందుకు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేశారు అని సూటిగా ప్రశ్నించారు. కేంద్రం కొన్నా కొనకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రమను గౌరవిస్తూ చివరి ధాన్యపు గింజ వరకూ కొంటుందని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా మద్దతు ధరతో మొక్కజొన్నలు కొంటున్నారా అని ప్రశ్నించిన ఆయన కేవలం తెలంగాణలోనే మొక్కజొన్నను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తు చేశారు.

**తగుదునమ్మా అంటూ కల్లాల్లోకి వస్తారా?**

రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున ఇన్ని వేల కోట్లు ఖర్చు పెట్టి రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 72.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుంటే తగుదునమ్మా అంటూ బీజేపీ, బీఆరఎస్ నాయకులు కల్లాల్లోకి వస్తాం, రైతుల కన్నీళ్లు తుడుస్తాం అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇన్ని రోజులు మీరెక్కడికి పోయారు అని ప్రశ్నించారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని భట్టి స్పష్టం చేశారు. ఒకే విడతలో రూ.22 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత తమదేనని, విమర్శలు మాని దమ్ముంటే కేంద్రం చేత ధాన్యం కొనుగోలు చేయించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.

**పేదల గృహ నిర్మాణానికి పెద్దపీట**

గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పేరుతో పేదలను వంచించిందని భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తొలి విడతగా రూ.22,500 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఉండకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.

**మహిళా సాధికారతకు అండ**

మహిళా సంఘాలకు రెండున్నరేళ్లలోనే రూ.67 వేల కోట్ల బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించామని, ఐదేళ్లలో ఈ మొత్తాన్ని రూ.1.25 లక్షల కోట్లకు పెంచుతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. మహిళా సంఘాలే స్వయంగా బస్సులు కొనుగోలు చేస్తే వాటిని ఆర్టీసీలో తిప్పి వారికి స్థిరమైన ఆదాయం కల్పించే వినూత్న కార్యక్రమాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని వివరించారు.

**స్థానిక సమస్యలపై సానుకూల స్పందన**

నియోజకవర్గంలో రూ.60 కోట్లతో సబ్‌స్టేషన్ల భూమి పూజలు, ప్రారంభోత్సవాలు జరిపారు. సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరిన పలు అభివృద్ధి పనులపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రఘునాథపాలెంలో 232 కేవీ సబ్‌స్టేషన్ అప్‌గ్రేడేషన్‌పై తక్షణమే సాధ్యాసాధ్యాల పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న కరెంట్ లైన్ల మార్పిడి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తానని సభాముఖంగా మాట ఇచ్చారు. గతంలో పక్కనబెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని, ఈ నియోజకవర్గానికి కూడా సబ్‌ప్లాన్ నిధులు పెద్ద ఎత్తున వస్తాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పల్లగుట్టకు చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు స్థానిక శాసనసభ్యుడు కడియం శ్రీహరి, పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, దొంతి మాధవరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తదితరులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

# కేబినెట్ కసరత్తుతో కాంగ్రెస్‌లో కలకలం

**మొదటిపేజీ తరువాయి**

ఎమ్మెల్యేలు ఢిల్లీలో మకాం వేసి పార్టీ అగ్రనేతలతో భేటీలు నిర్వహిస్తున్నారు.

**రాహుల్‌ను కలిసిన రాజగోపాల్ రెడ్డి**

మంత్రి పదవుల రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇటీవల ఆయన రాహుల్ గాంధీని కలిసి తనకు మంత్రి పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో అవకాశం చేజారిపోవడంతో ఈసారి ఎలాగైనా కేబినెట్‌లో చోటు సంపాదించాలనే పట్టుదలతో ఆయన ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

ఆయనతో పాటు మరికొందరు సీనియర్ నేతలు కూడా ఢిల్లీలో పార్టీ పెద్దలను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. దీంతో మంత్రి పదవుల కోసం పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

**సామాజిక సమీకరణాలే అధిష్టానానికి సవాల్**

తెలంగాణ కాంగ్రెస్‌లో కేబినెట్ విస్తరణ అంత సులభమైన వ్యవహారం కాదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. సీనియార్టీ, సామాజిక సమీకరణాలు, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉండటంతో అధిష్టానానికి సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ఒక వర్గానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే మరో వర్గంలో అసంతృప్తి పెరిగే పరిస్థితి ఉంది. అదే విధంగా ఒక ప్రాంతానికి చెందిన నేతలకు అవకాశాలు పెరిగితే ఇతర ప్రాంతాల నేతలు అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**కర్ణాటక అనుభవంతో అప్రమత్తమైన కాంగ్రెస్**

మంత్రి పదవులు ఆశిస్తున్న పలువురు నేతలు తమకు ప్రాధాన్యం దక్కకపోతే బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కేబినెట్ కూర్పుపై కాంగ్రెస్ అధిష్టానం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

కర్ణాటకలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ చేపట్టే విషయంలో హైకమాండ్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈ మార్పులు పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తాయా, లేక కొత్త అసంతృప్తికి దారితీస్తాయా అన్నది త్వరలో తేలనుంది

# ఆదాయానికి మించి 300శాతం ఆస్తులు!

**తెలంగాణ బ్యూరో, జూన్ 9:**

రాష్ట్రంలో మరో భారీ అవినీతి తిమింగలం అవినీతి నిరోధక శాఖ వలలో చిక్కింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఏసీబీ అధికారులు అవినీతిపరుల భరతం పడుతున్నారు. ఒకరిని మించి మరొకరు అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్న ఉదంతాలు వరుస దాడుల్లో వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా రోడ్లు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఈఎన్సీ మోహన్ నాయక్ ఇంట్లో ఏసీబీ అధికారులు జరిపిన సోదాల్లో విస్తుపోయే నిజాలు బయట పడ్డాయి. ఏకంగా ఆయన తన ఆదాయానికి మించి 300 శాతం అదనపు ఆస్తులు కూడబెట్టినట్లు అధికారుల విచారణలో తేలింది.

**9 చోట్ల ఏకకాలంలో దాడులు..**

మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆర్అండ్‌బీ ఈఎన్సీ మోహన్ నాయక్ నివాసంతో పాటు ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లు సహా మొత్తం 9 చోట్ల ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా నగదుతో పాటు, కిలోల కొద్దీ బంగారం, బంగారు బిస్కెట్లు, పలు చోట్ల కొనుగోలు చేసిన భూముల పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**రూ. 65 లక్షల నగదు, భారీగా ఆస్తులు..**

మియాపూర్‌లోని మోహన్ నాయక్ నివాసంలో జరిపిన సోదాల్లో ఎలాంటి లెక్కలు చూపని రూ. 65 లక్షల నగదు లభించిందని ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. దీనికి తోడు నిజామాబాద్‌లో భారీగా వ్యవసాయ భూములు, హైదరాబాద్ నగరంలో అనేక చోట్ల ప్లాట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. కాగా, వీటి విలువ రూ.200కోట్ల వరకు ఉంటుందని అధికారులు



అంచనా వేస్తున్నారు. మరో మూడేళ్ల సర్వీస్ ఉన్న ఈ అధికారిపై గతంలో అనేక ఆరోపణలు రావడంతోనే పక్కా సమాచారంతో ఈ దాడులు నిర్వహించినట్లు డీఎస్పీ స్పష్టం చేశారు.

# ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం తిరకాసు

**మొదటిపేజీ తరువాయి**

ప్రొక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ ఆబద్దాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ.170 కోట్లు చెల్లించామని వివరించారు.

8 లక్షల మేట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు చేయలేదని చెప్పారు. భవిషత్తులో పాడి ప్రొక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో ముందు బ్యారేజీల టెస్టింగ్ ప్రక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎసఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయని ఎన్‌డీఎసఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని.. యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణలోనే అవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని.. రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. బీజేపీ, బీఆరఎస్ ధాన్యం కొనుగోలుపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని దుష్ప్రచారం చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీరుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ.. తెలంగాణలో సేకరించినంతా ధాన్యం సేకరించలేదని తెలిపారు. అలాంటి బీజేపీ నేతలు ఇక్కడ యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలు చెప్పేవి అన్ని అబద్ధాలేనని మండిపడ్డారు. ధాన్యం విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లు కలిశామని తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని కోరామని.. కానీ కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు. రైతులపై బీజేపీ వైఖరి స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా బాధ్యతగా ధాన్యం కొనుగోలు చేయలేదని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. భవిషత్తులో పాడి ప్రొక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలనే అంశంపై.. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో హమాలీల సమస్య ఎక్కువగా ఉందని ప్రస్తావించారు. మోస్ట్ అడ్వాన్స్ మోడరైజేషన్ సిస్టం తేవాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న స్టోరేజ్ సరిపోవట్లేదని తెలిపారు.

# మైనారిటీల ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**మొదటిపేజీ తరువాయి**

జాబ్ మేళా మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ మేళాను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ మెగా జాబ్ మేళా నిర్వహణకు కృషి చేసిన టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తోపాటు అన్ని విభాగాల అధికారులకు, భాగస్వామ్య సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్లలో అమలుకాని అనేక కార్యక్రమాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లలో వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. మైనారిటీ వర్గాల అభ్యున్నతి, సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాల కల్పన దిశగా కృషి చేస్తోందని, మైనారిటీల సంక్షేమ శాఖ, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ సమన్వయంతో మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు తదితర



అన్ని మైనారిటీ వర్గాల యువతకు సమానావకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఆఫర్ లెటర్ ఇవ్వడంతో తమ బాధ్యత ముగియదు.. అభ్యర్థి కంపెనీలో చేరే వరకు మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తాం.. యువతకు ఉపాధి కల్పించడం మా బాధ్యత, మా వాగ్దానం అని అజారుద్దీన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో నిజామాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇలాంటి మెగా జాబ్ మేళాలను నిర్వహించి మరింతమంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

**నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

యువత విద్యతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మంత్రి సూచించారు. మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'టీజీఎంఎఫ్‌సీ ద్వారా అనేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి.. యువత ఈ అవకాశాలను వినియోగించుకుని తమ ప్రతిభను పెంపొందించుకోవాలి.. ఇంటర్వ్యూలలో పాల్గొని మంచి ఉద్యోగాలు సాధించాలి.. కృషి, పట్టుదల, నైపుణ్యాలే విజయానికి మార్గం' అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మైనారిటీ గురుకులాల వైస్ చైర్మన్ ఫహీముద్దీన్ ఖురేషీ, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి బి.షఫీఉల్లా, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.

**మెగా జాబ్ మేళా విశేషాలు**

మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ తన ఎంపానెల్డ్ ట్రైనింగ్ భాగస్వామ్య సంస్థల సహకారంతో ఈ మెగా జాబ్ మేళాను నిర్వహించింది. ఈ మేళాలో 50 నుంచి 60 వరకు ప్రముఖ కంపెనీలు, హెచఆర్ ప్రతినిధులు పాల్గొని లాజిస్టిక్స్ అండ్ ఈకామర్స్, రిటైల్ అండ్ హాస్పిటాలిటీ, ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ అండ్ అసెంబ్లీ, ఆటోమొబైల్ అండ్ మొబిలిటీ, నిర్మాణమౌలిక వసతులు, ఐటీఈఎస్/బీపీఓ, కార్పొరేట్ అడ్మినిస్ట్రేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్ అండ్ హెల్త్‌కేర్, మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్‌లలో ఉద్యోగావకాశాలు కల్పించాయి. సుమారు 20 శిక్షణ సంస్థలు కూడా పాల్గొన్నాయి. గతంలో శిక్షణ పొందిన విద్యార్థులు, ప్రస్తుతం శిక్షణ పొందుతున్న అభ్యర్థులు కూడా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2,000 మంది మైనారిటీ యువత ఈ జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఉద్యోగ అవకాశాలతోపాటు కెరీర్ కౌన్సెలింగ్ సేవలు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల నమోదు ప్రక్రియ కూడా నిర్వహించారు.




# జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు బండి సంజయ్ దూరమా?

**హైదరాబాద్, జూన్ 9:**

రాష్ట్రంలోని మున్సిపల్ ఎన్నికల సందడి మొదలవుతున్న వేళ బీజేపీలో మరో ఆసక్తికర చర్చ సాగుతోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ దూరంగా ఉండబోతున్నారా? గత ఎన్నికల్లో పార్టీ విజయాల్లో కీలక పాత్ర పోషించిన ఆయన ఈసారి ఏ బాధ్యతలు చేపడతారన్న అంశంపై కమలం పార్టీలో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

పదవీకాలం ముగిసిన మున్సిపల్ కార్పొరేషన్లు, వివిధ కారణాలతో వాయిదా పడిన మున్సిపాలిటీలకు త్వరలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లు, వరంగల్, ఖమ్మం మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించే అవకాశాల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించాయి. బీజేపీ కూడా గ్రౌండ్ స్థాయిలో కార్యాచరణకు శ్రీకారం చుట్టింది.

గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఊహించని స్థాయిలో సీట్లు గెలుచుకుని ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగింది. ఆ సమయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ చేపట్టిన ప్రచారం, ఆయన ప్రసంగాలు పార్టీకి భారీగా కలిసొచ్చాయని కేడర్ ఇప్పటికీ భావిస్తోంది. అనంతరం జరిగిన వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ మంచి ఫలితాలు సాధించడంలో బండి పాత్ర కీలకమనే అభిప్రాయం ఉంది.

అయితే ప్రస్తుతం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. బండి సంజయ్ ఇప్పుడు రాష్ట్ర అధ్యక్షుడు కాదు. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు వంటి నేతలు ఉండటంతో జీహెచ్‌ఎంసీ ఎన్నికల ప్రచార బాధ్యతలు వారిపైనే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

పార్టీలోని కొందరు నేతలతో బండి సంజయ్‌కు సన్నిహిత సంబంధాలు లేకపోవడం, స్థానిక రాజకీయ సమీకరణాలు కూడా ఆయన ప్రచారంపై ప్రభావం చూపే అవకాశముందని చర్చ జరుగుతోంది. ఈ కారణాలతో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ప్రచారంపై ఆయన పెద్దగా ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అయితే వరంగల్ ఎన్నికల విషయంలో మాత్రం బండి సంజయ్ ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. వరంగల్ బాధ్యతలు అప్పగిస్తే పూర్తిస్థాయిలో పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పార్టీ పెద్దలకు సంకేతాలు ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బండి సంజయ్‌కు పార్టీ ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తుందన్న అంశం ఇప్పుడు బీజేపీ కేడర్‌లో ఆసక్తికర చర్చగా మారింది.

# మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేని బీఆర్ఎస్

**హైదరాబాద్,జూన9:**

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని కాంగ్రెస్ సర్కార్ కోరుకుంటే బీఆరఎస్ ఏడుస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు. మహిళలు ఎదిగితే బీఆరఎస్ ఓర్వలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఫ్రీ బస్ స్కీమ్ తీసుకొస్తే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని బీఆరఎస్ పై ఫైర్ అయ్యారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ప్రభుత్వం మహిళా శక్తి సభ నిర్వహించింది. మంత్రి సీతక్క ఈ సభకు హాజరై ప్రసగించారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని తెలిపారు. రూ.2 వేల కోట్ల వడ్డీ డబ్బులను ప్రభుత్వమే చెల్లింస్తుదని చెప్పారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మూడు వేలకు పైగా మహిళా సంఘాలకు ఐకేపీ సెంటర్లు ఇచ్చామని.. వీటి ద్వారా ఆడబిడ్డలకు గతేడాది రూ.159 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో చదువుకోని 12 లక్షల మంది మహిళలకు చదువు చెప్పిస్తున్నామన్నారు. 60 ఏళ్లు దాటిన మహిళలను కూడా మహిళా సంఘాల్లో చేర్చుతున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులను ప్రపంచానికి చూపిస్తున్నామని అన్నారు.

# మహిళా సాధికారతకు మరో అడుగు

**మొదటిపేజీ తరువాయి**

కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000



కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్నీ కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. మన సంస్కృతి, సంప్రదాయల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆరఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం' అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తిపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్ర్య రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని అన్నారు.

# మల్కాజ్‌గిరి కార్పొరేషన్ భవన నిర్మాణానికి హైకోర్టు బ్రేక్

**హైదరాబాద్, జూన్9**

మల్కాజ్‌గిరి కార్పొరేషన్ భవన నిర్మాణానికి అనూహ్యంగా బ్రేక్ పడింది. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా శంకుస్థాపన చేసిన ఈ భవన నిర్మాణం చేపట్టవద్దని హైకోర్టులో మొత్తం ఐదు రిట్ పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఆయా రిట్ పిటిషన్లపై రాష్ట్ర హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. పిటిషనర్ల వాదనలు విన్న అనంతరం, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ భవన నిర్మాణంపై 'స్టేటస్ కో' ఆదేశించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అక్కడ ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టడానికి వీల్లేదని ధర్మాసనం పేర్కొంది. ఈ వివాదానికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం, కేసు తదుపరి విచారణను జూలై 7న వాయిదా వేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. దీంతో సీఎం శంకుస్థాపన చేసిన కొద్ది రోజులకే కోర్టు స్టేటస్ కో విధించడంతో మల్కాజ్‌గిరి కార్పొరేషన్ భవన నిర్మాణంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది

# ప్రజా నమ్మకమే ఈ ప్రభుత్వ బలం

**ఖమ్మం, జూన్ 9 :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' విజయవంతం కావడమే నిదర్శనమని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురామ్ రెడ్డితో కలిసి ఖమ్మంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12 నాటికి పూర్తి కాబోతోందని వెల్లడించారు.

**14 క్లస్టర్లలో వెల్లువెత్తిన జనసందోహం.. 24వేల పై దరఖాస్తులు**

నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా వర్గీకరించి గత 25 నుండి 30 రోజులుగా ప్రజల వద్దకే ప్రభుత్వం అనే నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. సోమవారంతో ఆఖరి విభాగం పూర్తయిందని, ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు 25వేల మంది ప్రజలను తాను వ్యక్తిగతంగా కలిసి వారి సమస్యలను కళ్లారా చూసి, చెవులారా విన్నానని పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి 24వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 11వేలు, ఆసరా పించన్ల కోసం 5,200 అర్జీలు అందినట్లు వివరించారు. అలాగే గృహజ్యోతి పథకం దరఖాస్తులతోపాటు అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారని చెప్పారు.

**సాదాబైనామాల సమస్యకు శాశ్వత పరిష్కారం**

గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చే ముందు సాదాబైనామాల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చి ఆ తర్వాత చట్టంలో చేర్చకుండా రైతులను గాలికి వదిలేసిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9.26లక్షల సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రిమండలి నిబంధనలను సవరించిందని తెలిపారు. గతంలో భూమి అమ్మిన వారి సమ్మతి కూడా కావాలనే నిబంధన ఉండేదని, కానీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అమ్మిన వారి సమ్మతి అవసరం లేకుండా నిబంధనలు మార్చామని చెప్పారు. ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తవుతుందని, చట్టప్రకారం 30 రోజుల నోటీసు గడువు తర్వాత అర్హులైన అన్ని సాదాబైనామాలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

**డిజిటల్ సర్వే.. సాగులో ఉన్న వారికే భూమి పట్టాలు**

తరతరాలుగా భూమి సాగులో ఉన్నా పట్టా పుస్తకాలు రావట్లేదని ఆవేదన చెందుతున్న రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం (కాకరవాయి)లో ఇప్పటికే ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చామని, ప్రజా దర్బార్‌లో వచ్చిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో దాదాపు 2,300 అప్లికేషన్లను ప్రత్యేక కార్యాచరణ ద్వారా త్వరలోనే పరిష్కరించబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం కొంత భూమి సేకరిస్తే ఆ సర్వే నెంబర్ మొత్తం నిషేధిత జాబితాలో పెట్టే పాత విధానాన్ని సవరించి పట్టా భూములను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశామన్నారు.

**ప్రతిపక్షాల బురదజల్లే రాజకీయాలను తిప్పికొట్టిన ఓటర్లు**

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, పదేళ్లు దొర పాలన సాగించిన మాజీ మంత్రులు రాజకీయ దురుద్దేశంతో, స్వలాభం కోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు. ప్రతిపక్షాల విమర్శల్లో ప్రజలకు ఉపయోగపడే న్యాయమైన అంశాలు ఉంటే పంతాలకు పోకుండా తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్‌కు కాంగ్రెస్ శ్రేణులు మాత్రమే కాక అన్ని పార్టీల పేదలు ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వచ్చారని మంత్రి అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికలు ఏవైనా సరే ఓటరు ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు.

**నిర్ణీత కాలపరిమితిలోగా గృహాలు, ఇళ్ల స్థలాల కేటాయింపు**

ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అధికారులను విభజించి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం 45 రోజుల సమయం పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను విడతలవారీగా అందజేస్తామని, అలాగే ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించామని, ఎక్కడైతే నివాసానికి యోగ్యమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిని సేకరించి కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై రేవంత్ ఆగ్రహం

- **బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శ**
- **న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం**

**హైదరాబాద్, జూన్ 9:**

మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇది బీజేపీ పన్నిన కుట్రేనని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రత్యర్థులను అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. 'వోట్ చోరీ', 'ఎస్ఐఆర్' తర్వాత ఇప్పుడు బీజేపీ 'సీట్ చోరీ'కి పాల్పడుతోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, అయినప్పటికీ ఆమె నామినేషన్‌ను తిరస్కరించడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకత్వం స్పందించేందుకు ప్రయత్నిస్తే కూడా అడ్డంకులు సృష్టిస్తున్నారని అన్నారు. జైరాం రమేష్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రతినిధి బృందం ఎన్నికల కమిషన్‌ను కలిసేందుకు వెళ్తే అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేకపోవడంతోనే కుట్రపూరితంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన ప్రత్యక్ష దాడి అని, ప్రజల గొంతుకలను అణచివేసే చర్య అని విమర్శించారు. ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి రోజుగా నిలిచిపోతుందని పేర్కొన్న ఆయన, ఈ ఘటనను ప్రతి పౌరుడు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.






# ట్రంప్‌కు వీసా దెబ్బ!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మహాశయుడికి ఎదురుగాలి వీస్తోంది. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఇప్పటికే ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని అమెరికా పౌరులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఇక ప్రపంచమంతా కూడా ట్రంప్ యుద్ధ పిపాసపై మండిపడుతోంది. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడ్డాయి. ఇంధనం దొరక్క అనేక దేశాలు అల్లాడి పోతున్నాయి. ఈ తరుణంలో ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా విదేశీ వృత్తి నిపుణుల హెచ్1బీ వీసాలకు ట్రంప్ సర్కార్ విధించిన లక్ష డాలర్ల ఫీజు చట్టవిరుద్ధమంటూ అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుతో అనేక కంపెనీలకు ఊరట లభించినట్లయ్యింది. దీనిపై ప్రవాస భారతీయ సంఘాలు, డెమోక్రాట్లతో పాటు ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ నేతలూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ పరిణామాలు వీసాల జారీపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న చర్చ జరుగుతోంది. అలాగే ఈ తీర్పుతో భారతీయులకు ప్రయోజనం ఎంతన్నది కూడా చర్చిస్తున్నారు. అమెరికా హెచ్-1బీ అనేది.. నాన్ ఇమిగ్రెంట్ వీసా. ప్రధానంగా ప్రత్యేక వృత్తుల్లో సాంకేతిక నైపుణ్యమున్న విదేశీయులను ఉద్యోగాల్లో నియమించుకోవటానికి యూఎస్ కంపెనీలను ఇది అనుమతిస్తుంది. అగ్రరాజ్యం ఏటా 65వేల మందికి ఈ వీసాలను జారీ చేస్తుంది. దీంతోపాటు అక్కడే మాస్టర్స్ చేసిన మరో 20వేల మందికి ఇవ్వాలనే నిబంధన ఉంది. అంటే మొత్తంగా ఏటా 85వేల హెచ్-1బీ వీసాలు జారీ అవుతుంటాయి. ఈ వీసాలు పొందినవారిలో దాదాపు 70శాతం మంది భారతీయులే ఉంటున్నారు. ఆ తర్వాత చైనా రెండో స్థానంలో ఉంది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 వేల నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా.. గతేడాది సెప్టెంబరులో ఈ వీసా ఫీజును ట్రంప్ ఏకంగా లక్ష డాలర్లకు పెంచేసారు. విదేశీ ఉద్యోగులపై ఆధారపడకుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెను ప్రభావమే పడింది. ఈ స్థాయిలో ఫీజును భరించలేక చాలా కంపెనీలు హెచ్-1బీ నియామకాలను తగ్గించాయి. ఈ ఫీజును సవాల్ చేస్తూ పలు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే హెచ్-1బీ వీసా ఫీజులపై విచారణ జరిపిన బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు.. అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపనందున దానిని చట్టవిరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ ఫీజు చెల్లబోదంటూ కీలక తీర్పు వెలువరించింది. దీంతో అమెరికా కంపెనీలపై తక్షణ ఆర్థికభారం తగ్గినట్లయ్యింది. అయితే, తీర్పు నేపథ్యంలో ఈ ఫీజును పూర్తిగా ఎత్తివేస్తారా? అంటే కాదనే సమాధానమే వినిపిస్తోంది. బోస్టన్ కోర్టు తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీల్ చేస్తామని వైట్‌హౌస్ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. అదే జరిగితే.. మరికొన్ని నెలల పాటు ఈ అంశం న్యాయస్థానాల్లో మగ్గనుంది. గతంలో కింది కోర్టు ఇచ్చిన తీర్పును ట్రంప్ సర్కారు అప్పీల్ చేసి గెలిచిన సందర్భాలూ ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్టే..! ఈ తీర్పు వల్ల ఏటా ఇచ్చే హెచ్-1బీ కోటాలో ఎలాంటి మార్పు ఉండదు. వీసా వస్తుందన్న గ్యారెంటీ కూడా లేదు. కాకపోతే.. ప్రస్తుతానికి ఫీజు భారం తగ్గడంతో ఈ అవకాశాన్ని అమెరికా కంపెనీలు సద్వినియోగం చేసుకునే వీలుంది. ఇప్పటికే వృత్తి నిపుణుల కొరతతో సతమతమవుతున్న కంపెనీలు.. మళ్లీ విదేశీ ఉద్యోగుల నియామకాలు పెంచుకునే వీలుంది. సాధారణంగా వీరిలో అత్యధిక అవకాశాలు భారతీయులకే దక్కుతాయి కాబట్టి.. మనవాళ్లకు కొంతమేర ఉపశమనం లభించినట్లేనని వృత్తి నిపుణులు భావిస్తున్నారు. అయితే అనేక వివాదాస్పద నిర్ణయాలతో ట్రంప్ ప్రజలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఈ వీసా నిబంధనల కారణంగా అమెరికాకు వచ్చే వృత్తి నిపుణులకు కొరత ఏర్పడింది. ఈ క్రమంలో హెచ్-1బీ వీసా ఫీజుపై ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేస్తూ.. ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అమెరికా లోని ప్రవాస భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది. ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పోరా స్టడీస్ కి చెందిన చీఫ్ స్పందించారు. హెచ్-1బీ వీసా రుసుముపై ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వలసల వ్యవస్థపై స్థిరత్వాన్ని ఇది తిరిగి తీసుకొస్తుందన్నారు. అమెరికాలో సాంకేతిక, ఆరోగ్య సంరక్షణ, అధునాతన తయారీ రంగాల వృద్ధికి ప్రపంచంలోని ప్రతిభావంతులు అవసరమని ఇక్కడి నిపుణులు అభిప్రాయపడ్డారు. విధానపరమైన మార్పులు, చట్టబద్ధమైన అధికారం, ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇండియాస్పోరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ జోషిపురా కోర్టు తీర్పుపై హర్షాతిరేకాలు తెలియజేశారు. అయితే, ట్రంప్ యంత్రాంగం ఈ విషయాన్ని ఇంతటితో ముగుస్తుందా.. లేదా అనే దానిపై అనుమానం వ్యక్తంచేశారు. ట్రంప్ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థలకు మధ్య ఇటీవల జరిగిన పలు వివాదాలను ప్రస్తావించారు. చట్టానికి విరుద్ధంగా.. విధానపరమైన అంశాలతో అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల కు మరిన్ని అడ్డంకులు సృష్టించవచ్చని హెచ్చరించారు. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం సంచలనం సృష్టించింది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈక్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు మాత్రమే దీనిపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేసింది. అయితే, ఈ తీర్పుపై ట్రంప్ యంత్రాంగం అప్పీల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# లోక్‌సభలో 2/3 మెజారిటీనే టార్గెట్

**డీలిమిటేషన్, రాజ్యాంగ బిల్లుల కోసం ఎన్డీయే వ్యూహాలు**

**కలిసిరానున్న టీఎంసీ, డీఎంకే రాజకీయ సంక్షోభం**

**2/3 మెజారిటీ సాధించే దిశగా బీజేపీ కూటమి..**

**న్యూఢిల్లీ, జూన్ 9:** తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సంక్షోభం, బీజేపీకి వరంగా మారుతోంది. తన లక్ష్యాలను సాధించుకోవడానికి ఎన్డీయే సర్కార్ వేగంగా పావులు కదుపుతోంది. ముఖ్యంగా, బీజేపీ సర్కార్ కీలకంగా భావిస్తున్న నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్)ను ఆమోదింప చేసుకుని, 2029 ఎన్నికలలోపే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని భావిస్తోంది. ఈ బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో 2/3 వంతు మెజారిటీ అవసరం. ప్రస్తుతం, ఉన్న ఎన్డీయే బలం దీనికి సరిపోదు. అయితే, ఇప్పుడు టీఎంసీ పరిణామాలు ఎంతో కొంత బీజేపీకి సహకరించే అవకాశం ఉంది. టీఎంసీకి చెందిన 20 మంది లోక్‌సభ ఎంపీలు ఎన్డీయేకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇది మమతా బెనర్జీకి భారీ ఎదురుదెబ్బగా చెప్పవచ్చు. సోమవారం మమతా ఇండియా కూటమి సమావేశంలో ఉన్న సమయంలోనే, తిరుగుబాటు ఎంపీలు బీజేపీ నేతలు, బెంగాల్ సీఎం సువేందు అధికారితో భేటీ అయ్యారు. కకోలి ఘోష్ దస్తిదార్ నేతృత్వంలో టీఎంసీ ఎంపీలు ఇప్పటికే ఓం బిర్లాకు లేఖ రాశారు. ఈ 20 మంది ఎంపీల మద్దతు లభిస్తే, లోక్‌సభలో ఎన్డీయే బలం



300 మార్కును దాటే అవకాశం ఉంది. మరోవైపు, డీఎంకే మద్దతు కోసం బీజేపీ తెరవెనక ప్రయత్నాలు చేస్తోంది. డీఎంకేకు లోక్‌సభలో 22 మంది ఎంపీలు ఉన్నారు. అంశాల వారీగా మద్దతు ఇస్తే ఎన్డీయే సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే, కాంగ్రెస్ విజయ్ టీవీకే పార్టీకి మద్దతు ఇవ్వడంతో డీఎంకే-కాంగ్రెస్ మధ్య బంధం విడిపోయింది. ప్రస్తుతం లోక్‌సభలో 543 స్థానాలు ఉంటే, మూడు ఖాళీలు ఉన్నాయి. దీంతో సభ్యుల సంఖ్య 540కి చేరింది. ఎన్డీయే బలం 293, టీఎంసీ తిరుగుబాటు ఎంపీలు 20 మంది కలిస్తే 313కు చేరుతుంది. డీఎంకే మద్దతు సంపాదిస్తే 335కు చేరుతుంది. శివసేన ఉద్ధవ్ వర్గానికి 9 మంది ఎంపీలు ఉన్నారు. వీరు చీలిపోతే ఆరుగురు ఎంపీలు ఎన్డీయే వైపు వస్తారు. దీంతో సంఖ్య 341కి చేరుతుంది. మూడింట రెండొంతులు(2/3) మెజారిటీ మార్క్ 362. మరో 12 సీట్ల దూరంలో ఎన్డీయే నిలిచిపోతుంది. చిన్న పార్టీలు, క్రాస్ ఓటింగ్ సాధ్యమైతే ఎన్డీయే మెజారిటీ సాధిస్తుంది. రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడానికి వీలవుతుంది. మరోవైపు రాజ్యసభలో ఎన్డీయే మూడింట రెండొంతుల మెజారిటీకి చేరువైంది. తృణమూల్ కు చెందిన 13 రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఇందులో చాలా మంది బీజేపీ వైపు వచ్చే ఛాన్స్ ఉంది. రాజ్యసభలో ఇప్పటికే ఎన్డీయేకు 150 సీట్లు ఉన్నాయి. డీఎంకే షరతులతో కూడిన మద్దతు ఇచ్చే ఛాన్స్ ఉంది. మూడింట రెండొంతుల మెజారిటీ మార్క్ 164 కాగా, ఈ సంఖ్యను ఈజీగానే ఎన్డీయే సాధించే అవకాశం ఉంది. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ కోసం వ్యూహాలు:

2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన కోసం రాజ్యాంగ సవరణ బిల్లు అవసరం అవుతుంది. 2026లో తొలి ప్రయత్నంగా డీలిమిటేషన్ బిల్లును ఎన్డీయే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోవడంతో ఈ బిల్లు ఓడిపోయింది. ఈసారి వర్షాకాల సమావేశాల్లో బీజేపీ ఈ బిల్లును మళ్లీ తీసుకురావాలని భావిస్తోంది. దీని కోసం వేగంగా పావులు కదుపుతోంది. మహిళలకు 33 శాతం రిజర్వేషన్, డీలిమిటేషన్ ప్రక్రియ, వన్ నేషన్-వన్ ఎలక్షన్ వంటి వాటికి ఆమోదం సాధించే లక్ష్యంగా ఎన్డీయే ప్రయత్నాలు మొదలుపెట్టింది.

# ఐరాసలో పాక్‌కు భారత్ హెచ్చరిక

**పాక్ చర్యల ఖండన**

**ఆఫ్ఘనిస్థాన్‌కు మద్దతు ప్రకటన**

**పౌరుల రక్షణపై దృష్టి**

**న్యూయార్క్, జూన్ 9:** ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఆఫ్ఘనిస్థాన్ భూభాగంపై పాకిస్థాన్ సైన్యం జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులు ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యలని, ప్రాంతీయ శాంతి భద్రతలకు ముప్పుగా మారుతున్నాయని భారత్ స్పష్టం చేసింది. ఐరాస సర్వసభ్య సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని ఈ వ్యాఖ్యలు చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. ముఖ్యంగా పౌర ప్రాంతాలపై జరిగే దాడులు అంతర్జాతీయ మానవతా సూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. యుద్ధాలు, ఘర్షణల సమయంలో సాధారణ ప్రజల ప్రాణాలు కాపాడటం ప్రతి దేశం బాధ్యత అని భారత్ గుర్తుచేసింది.



ఆఫ్ఘనిస్థాన్‌లోని ఐక్యరాజ్యసమితి సహాయ మిషన్ విడుదల చేసిన నివేదికలను హరీశ్ పర్వతనేని ప్రస్తావించారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే వందలాది మంది పౌరులు మరణించగా, మరెందరో గాయపడినట్లు నివేదికలు వెల్లడించాయని చెప్పారు. పవిత్ర రంజాన్ మాసంలో జరిగిన దాడుల్లో అధిక సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోవడం మరింత ఆందోళనకరమని పేర్కొన్నారు. ఐరాస నివేదికల విశ్వసనీయతను పాకిస్థాన్ ప్రశ్నించడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. అంతర్జాతీయ సంస్థలు రూపొందించిన నివేదికలను తమకు అనుకూలంగా ఉన్నప్పుడు మాత్రమే అంటకరించడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించింది. బహుళపక్ష వ్యవస్థలపై గౌరవం అంటే వాటి నిర్ణయాలు, నివేదికలను సమగ్రంగా పరిగణించడమేనని భారత్ స్పష్టం చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వం నెలకొల్పేందుకు ఐక్యరాజ్యసమితి సహాయ మిషన్ చేస్తున్న కృషికి భారత్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అంతర్జాతీయ చట్టాలను ప్రతి దేశం గౌరవించాలని, ముఖ్యంగా మానవతా చట్టాలను కచ్చితంగా పాటించాలని భారత్ పునరుద్ఘాటించింది. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐరాస ప్రధాన కార్యదర్శి చేసిన పిలుపుకు కూడా భారత్ మద్దతు తెలిపింది. దాడులపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత్ కోరింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంది. హింస, వైమానిక దాడులు సమస్యలకు పరిష్కారం కాదని, సంభాషణలు, శాంతియుత మార్గాల ద్వారానే ప్రాంతీయ స్థిరత్వం సాధ్యమవుతుందని భారత్ ఐరాస వేదికగా స్పష్టం చేసింది.

# కాంగోను వణికిస్తున్న ఎబోలా

**ఇప్పటికే 101 మంది మృత్యువాత**

**న్యూఢిల్లీ, జూన్ 9:** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ మేరకు కాంగో ఆరోగ్య అధికారులు ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటన ప్రకారం.. కాంగోలో ఇప్పటివరకు 550కి పైగా ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. వారిలో 101 మంది ప్రాణాలు కోల్పోగా.. 19 మంది కోలుకున్నారు. మరో 309 మంది ఎబోలా అనుమానితులు ఐసోలేషన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే ఇటురి, నార్త్ కిపులలో 35 కొత్త కేసులు నమోదవగా, మరో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం వైరస్ తీవ్రత పెరుగుతోందని, కొన్నిరోజుల తర్వాత తీవ్రత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధరణ.. వైరస్‌కు సరైన టీకా, చికిత్స



లేకపోవడం సవాళ్లుగా మారాయని తెలిపారు. కేసుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) హెచ్చరికలు జారీ చేసింది. ప్రాంతీయంగా ఈ వ్యాధి మరింత వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక, ఉగాండాలో 19 ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. కాగా.. రెండు మరణాలు చోటుచేసుకున్నాయి.

# హెచ్1బీ వీసాపై ట్రంప్‌కు షాక్

**లక్ష డాలర్ల ఫీజుపై కోర్టు కొట్టివేత**

**వాషింగ్టన్, జూన్ 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ తగిలింది. హెచ్1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల సుమారు రూ. 85 లక్షలకు పైగా భారీ ఫీజును అమెరికా ఫెడరల్ న్యాయస్థానం కొట్టేసింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం తీర్పు వెలువరించారు. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా హెచ్1బీకి ఎంపికైన వారు ఈ భారీ మొత్తాన్ని చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిబంధన తీసుకురాగా.. దీనిని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జడ్జి, అమెరికా కాంగ్రెస్ ఆమోదం




లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నులపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేశారు. ఈ భారీ వసూలు పెనాల్టీ కాదని, చట్ట విరుద్ధమైన పన్ను అని ప్రకటిస్తూ ఆ నిబంధన చెల్లదని కొట్టిపారేశారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఐటీ సహా పలు రంగాలకు చెందిన వేలాది మంది విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ టెక్కీలకు పెద్ద ఊరట లభించింది.

# గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతి

- **మలక్కా జలసంధికి అతిసమీపంలో జీఎన్ఐ ప్రాజెక్టు**

**న్యూఢిల్లీ, జూన్ 9:** గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతులు ఇచ్చింది. రూ.13వేల కోట్లతో పౌర-సైనిక విమానాశ్రయాన్ని నిర్మించనుంది. ఐఎన్ఎస్ బాజ్ వద్ద ఇప్పటికే ఉన్న నావికాదళ విమానాశ్రయాన్ని విస్తరించే ఆలోచనను పక్కనపెట్టింది. పర్యావరణపరంగా వైవిధ్యమైన ద్వీపంలో రూ.81వేల కోట్లతో ప్రకటించిన గ్రేట్ నికోబార్ ఐలాండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఇప్పటికే రాజకీయ దుమారం రేపుతోంది. ఈక్రమంలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం గమనార్హం. పౌర, సైనిక అవసరాలు తీరేలా గలాథియా బే సమీపంలోని చింగెన్ వద్ద ఈ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. భౌగోళిక పరిమితుల వల్ల ఇప్పటికే ఉన్న ఐఎన్ఎస్ బాజ్ ఎయిర్‌స్టేషన్ వద్ద రన్‌వేను విస్తరించేందుకు దీర్ఘకాలికంగా ఉన్న ప్రణాళికను పక్కనపెట్టాల్సి వచ్చింది. రానున్న ఐదేళ్లలో దీని నిర్మాణం పూర్తికావొచ్చని సమాచారం. నికోబార్ దీవి మలక్కా జలసంధికి అతిసమీపంలో ఉండటంతో జీఎన్ఐ ప్రాజెక్టు వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుందని రక్షణరంగ వర్గాలు వివరించాయి. జలసంధికి సమీపంలోనే యుద్ధ నౌకలు, వైమానిక సదుపాయాలు ఉండటం నిఘాకు ఎంతో కీలకం కానుందన్నాయి. చైనాకు చెందిన 80 శాతం చమురు, 70 శాతం సహజవాయువు మలక్కా జలసంధి మీదుగా రవాణా అవుతుందని వెల్లడించాయి. రూ.81వేల కోట్ల గ్రేట్ నికోబార్ ఐలాండ్ (ఉఔఎ) డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కింద తలపెట్టిన మౌలిక సదుపాయాల్లో ఎయిర్‌పోర్ట్ ఒకటి. అండమాన్ నికోబార్ ఐలాండ్‌ను ఆర్థిక, వ్యూహాత్మక హబ్‌గా మార్చే లక్ష్యంతో కేంద్రం ఈ ప్రాజెక్ట్‌ను ముందుకుతీసుకువచ్చింది. ఈ ప్రాజెక్టును విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇది దేశ సహజ, గిరిజన వారసత్వ సంపదకు వ్యతిరేకంగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 160 చదరపు కిలోమీటర్ల మేర లక్షల చెట్లను నరికివేయాల్సి వస్తుందని, ఇది అభివృద్ధి అనే ముసుగులో జరుగుతున్న విధ్వంసమని మండిపడ్డారు.



# జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీపై మంత్రి పొంగులేటి హామీ

- టీడబ్ల్యూజేఎఫ్ వినతిపై స్పందించిన మంత్రి
- కలెక్టర్, డీఈవోలకు సూచిస్తానని వెల్లడి



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ – హెచ్ – 2843) ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 % ఫీజు రాయితీ కల్పించాలని టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ స్థానిక ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో మంగళవారం వినతిపత్రం సమర్పించింది. దీనిపై స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్, డీఈవోలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రాన్ని కలెక్టర్ కు పంపాల్సిందిగా తన వ్యక్తిగత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలు, మధ్యతరగతి వర్గానికి చెందినవారని, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని టీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రంలో పేర్కొంది. అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు కాబట్టి వారిని అవకాశం ఉన్న మేరకు ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉన్నదని జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు సామాన్యునికి అందుబాటులో లేవని అన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు తమ పిల్లలను చదివించుకోవటం భారం అవుతోందని పేర్కొన్నారు . ప్రతీ ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో సెక్షన్ కు నలుగురు చొప్పున పేద విద్యార్థులకు ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించాలనే నిబంధన ఉన్నా ఏ ఒక్కచోటా ఇదీ సక్రమంగా అమలు అవుతున్న దాఖలాలు లేవన్నారు. పేద, మధ్యతరగతి వర్గానికి చెందిన జర్నలిస్టుల పిల్లల విషయంలోనైనా ఇదీ అమలయ్యేలా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రతీ ప్రైవేటు, కార్పొరేటు పాఠశాల, కళాశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా... సమాచార శాఖ మంత్రిగా ప్రభుత్వం తరపున ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరడంతో ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రభుత్వం నుంచి తగు ఆదేశాలు జారీ చేయిస్తానని మంత్రి స్పష్టతనిచ్చారు. మంత్రికి వినతిపత్రం సమర్పించిన వారిలో టీబీజేఏ జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు మారెడ్డి నాగేందర్ రెడ్డి, మధుశ్రీ, జానీపాష, యాకేష్, గణేష్, పెంద్ర అంజయ్య, కొమిరె నాగేశ్వరరావు, అర్షద్, ఫయాజ్, యాకూబ్ పాష, శరత్, యూసుఫ్, యాస లక్ష్మారెడ్డి, డి. రవికుమార్, కొరకొప్పుల రాంబాబు, కరణబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పూరి గుడిసె లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** జిల్లాలో ఒక్క పూరిగుడిసె కూడా లేకుండా పూరిగుడిసెలు లేని జిల్లాగా" కామారెడ్డిని తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. రామారెడ్డి మండలంలోని వడ్డెర కాలనీ సందర్శించి పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం మండల పరిధిలో పర్యటించిన సందర్భంగా పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, గృహ సౌకర్యం లేని అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని, పేమెంట్ సమస్యలు తలెత్తితే ఏపీఎం ద్వారా రుణాలు మంజూరు చేయాలని అన్నారు. నిజమైన లబ్ధిదారులను గే ఎలాంటి పొరపాట్లు జరగకుండా గ్రామస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనం పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో pd హౌసింగ్ విజయపాల్ రెడ్డి, తాసిల్దార్ ఉమలత, ఎంపీడీవో నాగేశ్వర్, సర్పంచ్ బండి ప్రవీణ్,, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ

**జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** జిల్లాలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడం, ప్రతి చిన్నారికి విద్యను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు.మంగళవారం రామారెడ్డి మండలంలోని SC కాలనీ లో నిర్వహించిన బడి బాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, ఇంటింటి ప్రచారం ద్వారా పాఠశాల వయస్సు కలిగిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన చిన్నారులకు ప్రీ–ప్రైమరీ తరగతుల్లో, అలాగే ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో అడ్మిషన్లు నమోదు చేయడం జరిగింది. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థులను కూడా గుర్తించి నమోదు చేపట్టడం జరిగిందని అన్నారు.అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ సమావేశమై ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. పాఠశాల వయస్సు కలిగిన ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే డ్రాప్‌అవుట్ విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యే సమాజాభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం, త్వరలో ప్రారంభం కానున్న అల్పాహార పథకం, డిజిటల్ విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులుగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అధికారుల మౌనంతో అక్రమ నిర్మాణాల జోరు..!

- నివాస ప్రాంతంలో షెడ్ నిర్మాణమా..! నిబంధనలకు పాతర...!?
- ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యం.. టౌన్ ప్లానింగ్ విభాగం ఏమి చేస్తోంది..?



**నాగారం, రాజముద్ర న్యూస్:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ లోని ఆర్.ఎల్. నగర్ మెయిన్ రోడ్డు నివాస ప్రాంతంలో అక్రమంగా షెడ్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ షెడ్ల నిర్మాణాలపై స్థానికుల అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నివాస అవసరాల కోసం కేటాయించిన ప్రాంతాల్లో వాణిజ్య లేదా ఇతర నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్, పార్కింగ్, కాలుష్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? లేక నిబంధనలను ఉల్లంఘిస్తూ పనులు కొనసాగుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రత్యేకంగా నాగారం డివిజన్ పరిధిలో రోజురోజుకీ అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సంబంధిత విభాగాలు ఎందుకు మౌనం వహిస్తున్నాయన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూస్తూ ఊరుకోవడం వెనుక కారణాలేమిటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఫిర్యాదులు కేవలం ఫైళ్లకే పరిమితమవుతున్నాయా? లేక అక్రమ నిర్మాణాలకు ఎవరి అండదండలు ఉన్నాయి? అనే ప్రశ్నలు ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# ఖమ్మం నగరంలో అమానుషం.. బాలికపై అఘాయిత్యం

**భవనంపై నుంచి తోసేసిన నిందితుడు.. పోక్సో కేసు నమోదు, బీజేపీ ఆగ్రహం**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఖమ్మం, ఖమ్మం నగరంలో మానవత్వాన్నే సిగ్గుపడేలా చేసే ఘటన చోటుచేసుకుంది. 12 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టి, అనంతరం మూడంతస్తుల భవనంపై నుంచి కిందకు తోసేసిన దారుణం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 6వ తేదీన ఖమ్మం నగరంలోని ఓ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న గౌస్ (49) అనే వ్యక్తి బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం బాధితురాలిని మూడంతస్తుల భవనం పైనుంచి కిందకు తోసేశాడు. ఈ ఘటనలో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. వెన్నుపూస, చేతులు, కాళ్లు, పక్కటెముకలకు గాయాలైనట్లు వైద్యులు తెలిపారు.తీవ్రంగా గాయపడిన బాలికను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని మరో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ఘటనపై సోమవారం ఖమ్మం టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు గౌస్‌పై పోక్సో చట్టంతో పాటు హత్యాయత్నం సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ అమానుష ఘటనపై బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ తీవ్రంగా మండిపడ్డారు. "మైనర్ బాలికపై అత్యాచారం చేసిన లారీ డ్రైవర్ గౌస్ పాషాను వెంటనే అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కఠినంగా శిక్షించాలి" అని డిమాండ్ చేశారు. "రాష్ట్రంలో మహిళలకు, చిన్న పిల్లలకు రక్షణ లేకుండా పోతోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి" అని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బాధిత బాలికకు న్యాయం చేయాలని స్థానికులు, పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇవ్వండి

**కలెక్టర్, డీఈవోలకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి**



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 2026–27 విద్యా సంవత్సరాలలో ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో బాగంగా వారి పిల్లల చదువులకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు వేతనాలు సరిగా లేక నెలవారీ ఆదాయం లేక వారి పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నారని,ఈ పరిస్థితిలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని వారు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని కోరారు. రాబోయే 2026–27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ను కలిసి వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో–కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, పి. సంతోష్ కుమార్, అడ్వయిజర్ గోవింద్ నాయక్, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య తదితరులున్నారు. అనంతరం వారు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి(డీఈఓ) యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

# రైతులకు మరింత చేరువగా సహకార బ్యాంకింగ్ : మంత్రులు పొంగులేటి, తుమ్మల

- కరుణగిరి, చెరువు మాదారం నూతన డీసీసీబీ శాఖల ప్రారంభం
- రూ. 20 వేల కోట్ల రుణమాఫీతో రైతులకు అండగా నిలిచాం



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం రైతులు, స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి కరుణగిరి డిసిసిబి బ్రాంచిని వరంగల్ క్రాస్ రోడ్డులో, నేలకొండపల్లి మండలం చెరువు మాదారం డిసిసిబి బ్రాంచిని చెరువు మాదారం గ్రామంలో మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సీపీ సునీల్ దత్‌లతో కలిసి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... ప్రైవేట్, కమర్షియల్ బ్యాంకులతో పోటీగా డీసీసీబీ శాఖలు ఆధునిక ఆర్థిక సేవలు అందిస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఖమ్మం డీసీసీబీ రూ. 5 కోట్ల లాభాలను ఆర్జించిందని కలెక్టర్ పేర్కొన్నారు.

## శ్రీ కాలభైరవ స్వామి కి ఘనంగా సింధూర పూజలు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం ఈసనపల్లి (రామారెడ్డి) గ్రామలలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామికి మంగళవారం రోజన, ఘనంగా సింధూర పూజలు నిర్వహించారు , ధూప దీప నైవేద్యాలతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు పూజారులు అభిషేకాలు,నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, ఆలయ చైర్మన్ చింతల శంకర్, డైరెక్టర్లు, అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, పంతులు శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మ , నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు: భారీగా కల్తీ కారంపొడి, సుగంధ ద్రవ్యాల స్వాధీనం



**రాజముద్ర న్యూస్, కరీంనగర్, జూన్ 09 :** నగరంలోని శనివారం మార్కెట్ పరిధిలో కల్తీ కారంపొడి విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈరోజు మెరుపు దాడులు నిర్వహించారు. మార్కెట్లోని "గౌరిశెట్టి రమేష్" మరియు "సిద్ధంశెట్టి చక్రపాణి కిరాణం & సుగంధ ద్రవ్యాల దుకాణాల్లో (Spices Shops) జరిపిన ఈ సోదాల్లో భారీ మొత్తంలో కల్తీ అనుమానిత నిల్వలను కనుగొన్నారు. ఈ దాడుల సమాచారాన్ని వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు చేరవేయగా, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు అంకిత్ రెడ్డి, రోహిత్ రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. టాస్క్ ఫోర్స్ బృందం వారి సమక్షంలో సుమారు 47 బస్తాల కారంపొడి (ప్రతి బస్తా బరువు 50 కిలోలు), 2 బస్తాల పసుపు, మరియు 1 బస్తా ధనియాల పొడిని స్వాధీనం చేసుకుని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు సదరు దుకాణాల నుండి నమూనాలను (Samples) సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబొరేటరీకి పంపించారు. ఈ ల్యాబ్ పరీక్షల ఫలితాలు వచ్చే వరకు సదరు స్టాక్‌ను పూర్తిగా సీజ్ చేయడం జరిగిందని, అలాగే ఈ సుగంధ ద్రవ్యాల అమ్మకాలపై పూర్తి నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్, ఎస్సైలు మామిడాల సురేందర్, శ్రీకాంత్ కానిస్టేబుల్ సాయిదీప్ లు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లాలో 2.77 లక్షల ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి



**రాజముద్ర న్యూస్, కరీంనగర్, జూన్ 09:** 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి కరీంనగర్ జిల్లాకు కేటాయించిన 2,77,340 ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీని జిల్లాలోని 16 మండలాలకు విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ ఎన్. ప్రశాంత్ రెడ్డి తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామని, జిల్లాలోని అన్ని మండలాలకు అవసరమైన పాఠ్యపుస్తకాల సరఫరా ప్రక్రియను శాతం వందకు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల విద్యాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని తమ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సకాలంలో చేరేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జూన్ 12వ తేదీ నాటికి ప్రతి పాఠశాలలో అన్ని తరగతులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి, విద్యార్థులకు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పాఠ్యపుస్తకాల స్వీకరణ, నిల్వ, పంపిణీ ప్రక్రియలో ప్రధానోపాధ్యాయులు మరియు సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎక్కడా కొరత లేదా ఆలస్యం తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అవసరమైన అన్ని విద్యా వనరులు అందుబాటులో ఉండేలా విద్యాశాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో సహకరించిన టెక్స్ట్‌బుక్స్ జిల్లా మేనేజర్, టెక్స్ట్‌బుక్స్ నోడల్ అధికారి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు మరియు సిబ్బందిని జిల్లా విద్యాశాఖాధికారి అభినందించారు.

# తెలంగాణ ఆత్మగౌరవ గీతానికి చిరస్మరణీయ నివాళి

- **రూ.4 కోట్ల వ్యయంతో ఘట్కేసర్‌లో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటు**
- **స్మృతి వనం పనులను పరిశీలించిన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ఘట్కేసర్, రాజముద్ర న్యూస్:** తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో ప్రజల్లో రగిలించిన మహాకవి, ప్రజా గాయకుడు, రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పక్కన ఏర్పాటు చేయనున్న 'అందెశ్రీ స్మృతి వనం' స్థలాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రలో అందెశ్రీది ప్రత్యేక స్థానం అని పేర్కొన్నారు. తన గీతాలు, రచనల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అందెశ్రీ సేవలకు గుర్తింపుగా ఈ స్మృతి వనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఘట్కేసర్‌లో ప్రభుత్వం ఎకరం 22 గుంటల భూమిని ఇందుకోసం కేటాయించిందని మంత్రి వెల్లడించారు. ఇది కేవలం ఒక ఉద్యానవనం మాత్రమే కాకుండా, తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే స్మారక క్షేత్రంగా రూపుదిద్దుకోనుందని చెప్పారు. అందెశ్రీ జీవిత విశేషాలు, ఉద్యమంలో ఆయన పాత్ర, సాహిత్య సేవలను భావితరాలకు చేరవేసే విధంగా స్మృతి వనాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రను, ఉద్యమ స్ఫూర్తిని యువతకు పరిచయం చేసే జ్ఞాపక చిహ్నంగా ఈ ప్రాంగణం నిలవాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ... స్మృతి వనం అభివృద్ధి కోసం ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం స్మృతి వనాన్ని నిర్వహణ కోసం హెచ్ఎండీఏకు అప్పగించనున్నట్లు చెప్పారు. స్మృతి వనంలో అందెశ్రీ విగ్రహం, ఆయన జీవిత చరిత్రను ప్రతిబింబించే శిలాఫలకాలు, తెలంగాణ ఉద్యమ గీతాల ప్రదర్శన గ్యాలరీ, సాహిత్య వేదిక, పచ్చదనంతో కూడిన ప్రత్యేక ఉద్యానవనం, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని గీతంగా మలిచిన మహాకవి అందెశ్రీకి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ గౌరవం, తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది.

## పంట అవశేషాల దహనం నేరం.. కాల్చితే రూ.25 వేల వరకు జరిమానా

**తిరుమలాపురంలో వరి కొయ్యలు కాల్చిన రైతుకు రూ.5 వేలు ఫైన్ - డీఏఓ పుల్లయ్య, డీపీఓ రాంబాబు హెచ్చరిక**




5000=00
పంచాయతీ కార్యదర్శి
గ్రామం: తిరుమలాపురం,
నేలకొండపల్లి మం॥ ఖమ్మం జిల్లా.

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి పంట అవశేషాలను కాల్చడం చట్టవిరుద్ధమని, రైతులు అలాంటి చర్యలకు పాల్పడవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు సంయుక్తంగా హెచ్చరించారు. మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.నేలకొండపల్లి మండలం తిరుమలాపురం గ్రామ పంచాయతీ పరిధిలో వరి కొయ్యలను కాల్చినందుకు బి. కృష్ణారావు అనే రైతుకు గ్రామ పంచాయతీ ద్వారా రూ.5 వేలు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.పంట కోత అనంతరం వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి తదితర పంటల అవశేషాలను బహిరంగంగా కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూమిలోని సేంద్రియ పదార్థాలు, సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గిపోతుందని డీఏఓ పుల్లయ్య వివరించారు. దీని ప్రభావం తదుపరి పంటల దిగుబడులపై ప్రతికూలంగా పడుతుందని పేర్కొన్నారు.

**జీఓ ఎంఎస్ నెం.27 ప్రకారం చర్యలు**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కొందరు రైతులు ఇంకా పంట వ్యర్థాలను కాలుస్తున్నారని డీపీఓ రాంబాబు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జిఓ ఎంఎస్ నెం.27 పర్యావరణ, అటవీ శాఖ ఉత్తర్వుల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు, పంట అవశేషాలను కాల్చడాన్ని పూర్తిగా నిషేధించారని వివరించారు.

**జరిమానాల వివరాలు:**

సాధారణ స్థాయిలో కాల్చితే:★ రూ.5 వేలు పర్యావరణ పరిహారం

భారీ స్థాయిలో కాల్చితే: రూ.25 వేల వరకు జరిమానా

గ్రామ పంచాయతీలకే జరిమానా విధించే అధికారం ఉందని అధికారులు స్పష్టం చేశారు.రైతులు పంట అవశేషాలను కాల్చకుండా కంపోస్టు, వర్మీ కంపోస్టు తయారీకి వినియోగించుకోవాలని సూచించారు. వాటిని ఇంధనంగా కూడా ఉపయోగించే అవకాశం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ, భూసార సంరక్షణ, వ్యవసాయ ఉత్పాదకత పెంపు కోసం ప్రతి రైతు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో చట్టప్రకారం జరిమానాలతో పాటు అవసరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

- **జూన్ 15 లోగా సీసీటీఎన్ఎస్ 2.0, 'ఈ-సాక్ష్య'లో వివరాల నమోదు పూర్తి కావాలి**
- **నగల దుకాణాలు, బ్యాంకులు, లాడ్జీల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక నిఘా**
- **హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల పనితీరు 'భేష్': సీపీ అభినందన**



**రాజముద్ర న్యూస్, హుజురాబాద్, జూన్ 09:** వార్షిక తనిఖీల్లో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం హుజురాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయానికి విచ్చేసిన సీపీకి సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం కార్యాలయాన్ని, పెండింగ్ కేసులు మరియు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ కీలక ఆదేశాలు మరియు వివరాలను వెల్లడించారు:

**సాంకేతికత వినియోగం - జూన్ 15 గడువు:**

గౌరవ డీజీపీ గారి ఆదేశాల మేరకు పోలీసింగ్‌లో సాంకేతికతను విరివిగా ఉపయోగించాలని సీపీ స్పష్టం చేశారు. ప్రివెంటివ్ పోలీసింగ్, సీసీటీఎన్ఎస్ 2.0 (CCTNS 2.0), 'ఈ–సాక్ష్య' యాప్‌లలో కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను జూన్ 15 లోగా తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. పాత పెండింగ్ కేసుల వివరాలతో పాటు, కొత్తగా నమోదయ్యే కేసుల డేటాను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని, కేసుల ఆధారాల సేకరణలో 'ఈ–సాక్ష్య'ను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు.

**భద్రతా ప్రమాణాల సమీక్ష - నోటీసుల జారీ:**

గత నెలలో కరీంనగర్ పీఎంజే నగల షోరూంలో జరిగిన దారిదోపిడీ ఘటనను దృష్టిలో ఉంచుకుని కమిషనరేట్ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. జిల్లా మరియు మండల స్థాయిల్లోని నగల దుకాణాలు, బ్యాంకులు, లాడ్జీలు, హోటళ్లలో భద్రతా ప్రమాణాలను సమీక్షించి, సీసీ కెమెరాల ఏర్పాటుపై స్పష్టమైన నిబంధనలు జారీ చేశామని తెలిపారు. భద్రతా లోపాలు ఉన్న యాజమాన్యాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

**నేరాల నియంత్రణ - బేసిక్ పోలీసింగ్:**

వలస కార్మికుల డేటా: నేపాలీలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు, ఇతర వ్యక్తుల పూర్తి వివరాలతో కూడిన రికార్డులను కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో మైంటైన్ చేస్తున్నట్లు తెలిపారు. కార్డన్ అండ్ సెర్చ్: బేసిక్ పోలీసింగ్‌లో భాగంగా అనుమానాస్పద ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, హోటళ్లు, లాడ్జీలలో తనిఖీలు మరియు వాహన తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. పాత నేరస్థులపై నిరంతర నిఘా ఉంచినట్లు చెప్పారు. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం: డ్రగ్స్ నిర్మూలనకై నార్కోటిక్స్‌లో శిక్షణ పొందిన ప్రత్యేక పోలీస్ డాగ్స్ (జాగిలాలు) సహాయంతో పాన్ షాపులు, హాస్టళ్లు, పబ్లిక్ ప్రదేశాలను తనిఖీ చేస్తున్నామన్నారు. డ్రగ్ టెస్ట్ కిట్‌లు అందుబాటులో ఉన్నాయని, అనుమానితులకు పరీక్షలు నిర్వహించి పట్టుబడితే ఎన్డీపీఎస్ (NDPS) చట్టం ప్రకారం కఠిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళల రక్షణ: మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం 'షీ లీడ్స్', 'స్నేహిత' కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. అలాగే నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలకు తక్షణమే మరమ్మతులు చేయించి పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పోలీస్ సిబ్బందికి అభినందనలు:**

తనిఖీల్లో భాగంగా హుజురాబాద్ సబ్ డివిజన్ పోలీసుల పనితీరు, రికార్డుల నిర్వహణ పట్ల సీపీ గౌష్ ఆలం సంతోషం వ్యక్తం చేస్తూ "భేష్" అని అభినందించారు. ఈ సమీక్షలో చర్చించిన అంశాలను క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో అమలు చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వార్షిక తనిఖీ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసీపీ మాధవి, ఇన్స్పెక్టర్లు కరుణాకర్, రామకృష్ణ, వెంకట్, శ్రీనివాస్, ఎస్సైలు స్వాతి, ఆవుల తిరుపతి మరియు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాముల భయం.. ఫుట్‌బాల్ జట్టుకు హెచ్చరిక



**న్యూఢిల్లీ, జూన్ 9:** ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్‌గా గుర్తింపు పొందిన ప్రపంచకప్ ప్రారంభానికి ముందే స్విట్జర్లాండ్ జట్టుకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. టోర్నమెంట్ కోసం అమెరికాలో శిక్షణ పొందుతున్న ఆ జట్టు ఆటగాళ్లకు స్థానిక అధికారులు ప్రత్యేక హెచ్చరికలు జారీ చేశారు. వారు శిక్షణ పొందుతున్న ప్రాంతం సమీపంలో అత్యంత విషపూరితమైన పాములు సంచరిస్తున్నట్లు గుర్తించడంతో ఈ జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం స్విట్జర్లాండ్ జట్టు అమెరికాలోని శాన్ డియాగో ప్రాంతంలో సాధన కొనసాగిస్తోంది. అయితే అక్కడి శిక్షణ కేంద్రం చుట్టుపక్కల అత్యంత ప్రమాదకరమైన విషసర్ప జాతులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు వన్యప్రాణి అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా రాటిల్ స్నేక్‌గా పిలిచే విషసర్పాల నాలుగు రకాల జాతులు ఆ ప్రాంతంలో నివసిస్తున్నాయని గుర్తించారు. ఈ పాముల కాటు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉండటంతో ఆటగాళ్లు శిక్షణ మైదానం పరిమితులు దాటి వెళ్లవద్దని యాజమాన్యం ఆదేశించింది. శిక్షణ సమయంలో ఫుట్‌బాల్ బంతులు కొన్నిసార్లు మైదానం దాటి పొదల్లోకి వెళ్లే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటిని తిరిగి తెచ్చుకోవడం సహజమే అయినప్పటికీ, ఈ శిబిరంలో మాత్రం అలాంటి సాహసాలకు పూర్తిగా నో చెప్పేశారు. పొరపాటున బంతి మైదానం వెలుపలికి వెళ్లినా దానిని తీసుకురావడానికి ఎవరూ వెళ్లవద్దని, కొత్త బంతులతోనే సాధన కొనసాగించాలని ఆటగాళ్లకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఈ ప్రపంచకప్‌లో స్విట్జర్లాండ్ జట్టు గ్రూప్-బిలో స్థానం దక్కించుకుంది. అదే గ్రూప్‌లో ఆతిథ్య దేశం కెనడాతో పాటు ఖతార్, బోస్నియా-హెర్జెగోవినా జట్లు ఉన్నాయి. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో స్థిరమైన ప్రదర్శనకు పేరుగాంచిన స్విట్జర్లాండ్ జట్టు, మైదానంలో క్రమశిక్షణతో కూడిన ఆటతీరుతో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఇప్పుడు ఈ అనూహ్య పరిస్థితులను అధిగమిస్తూ టోర్నమెంట్‌లో ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈసారి ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత విస్తృత స్థాయిలో నిర్వహించబడుతోంది. జూన్ 12 నుంచి ప్రారంభమై జూలై 19 వరకు సాగే ఈ మెగా టోర్నీలో తొలిసారిగా 48 జట్లు పాల్గొంటున్నాయి. అలాగే అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తుండటం కూడా ప్రపంచకప్ చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా నిలవనుంది

# స్టోక్స్‌కు కొత్త చిక్కులు



**లండన్, జూన్ 9 :** ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ మరోసారి వివాదంలో చిక్కుకున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. జట్టు క్రమశిక్షణ నిబంధనలను ఉల్లంఘించిన ఘటనపై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. న్యూజిలాండ్‌పై లార్డ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో విజయం సాధించిన అనంతరం స్టోక్స్, సహచర ఆటగాడు గస్ అట్కిన్‌సన్‌తో కలిసి ఒక రాత్రి వినోద కేంద్రానికి వెళ్లినట్లు సమాచారం. అక్కడ చోటుచేసుకున్న ఘర్షణ ఇప్పుడు ఇంగ్లండ్ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ఆ వినోద కేంద్రంలో ఒక రగ్బీ క్రీడాకారుడితో మాటామాటా పెరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో అట్కిన్‌సన్‌ను లక్ష్యంగా చేసుకుని విసిరిన దెబ్బ, అక్కడ విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బందికి తగిలినట్లు తెలుస్తోంది. గాయపడిన భద్రతా సిబ్బందికి వైద్య చికిత్స అందించగా, కుట్లు కూడా వేసినట్లు సమాచారం. అయితే ఈ ఘటనలో స్టోక్స్ లేదా అట్కిన్‌సన్‌కు ఎలాంటి గాయాలు కాలేదని తెలుస్తోంది. ఈ ఘటనపై స్పందించిన ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వర్గాలు, ఇద్దరు ఆటగాళ్లు దురుసుగా ప్రవర్తించినట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నాయి. అలాగే ఘటన స్థలానికి పోలీసులు కూడా రాలేదని వెల్లడించాయి. అయినప్పటికీ అసలు ఏం జరిగిందనే విషయంపై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇటీవలి కాలంలో ఆటగాళ్ల ప్రవర్తనపై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రత్యేక దృష్టి పెట్టింది. జట్టు సభ్యులు అర్ధరాత్రి తర్వాత బయట తిరగకుండా కఠిన మార్గదర్శకాలు అమలు చేస్తోంది. గతంలో చోటుచేసుకున్న కొన్ని వివాదాల నేపథ్యంలో ఈ నిబంధనలను మరింత కఠినతరం చేశారు. రాత్రి వేళ వినోద కేంద్రాలకు వెళ్లకుండా ఉండాలని ఆటగాళ్లకు ఇప్పటికే సూచనలు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే న్యూజిలాండ్‌పై విజయం సాధించిన తర్వాత జరిగిన సంబరాల్లో భాగంగా స్టోక్స్, అట్కిన్‌సన్ నిర్ణయించిన సమయాన్ని దాటి అక్కడే కొనసాగినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఘర్షణ చోటుచేసుకుని ఉండవచ్చని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. దీంతో క్రమశిక్షణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ వివాదం కారణంగా స్టోక్స్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అతడిని తదుపరి టెస్టుకు దూరం పెట్టవచ్చనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అదే విధంగా అట్కిన్‌సన్ భవితవ్యంపైనా స్పష్టత రావాల్సి ఉంది. కాగా, గతంలో కూడా స్టోక్స్ రాత్రి వేళ జరిగిన ఘర్షణ ఘటనతో వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి అతని పేరు వివాదంలో వినిపించడంతో ఇంగ్లండ్ క్రికెట్ వర్గాల్లో చర్చ మరింత వేడెక్కింది. విచారణ పూర్తయ్యే వరకు ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# అంతర్జాతీయ క్రికెట్‌కు ముందే వైభవ్ సంచలనం



**ముంబై, జూన్ 9 :** భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం వెలుగులోకి వచ్చింది. బీహార్‌కు చెందిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన అసాధారణ ప్రతిభతో దేశ విదేశాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాడు. ఇంకా అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టకముందే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం అతడి ప్రత్యేకతగా నిలుస్తోంది. చిన్న వయసులోనే అతడు ప్రదర్శిస్తున్న దూకుడు ఆటతీరు, భారీ షాట్లు మరియు ఆత్మవిశ్వాసంతో కూడిన బ్యాటింగ్ క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గత కొంతకాలంగా దేశీయ స్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనలు చేస్తున్న వైభవ్, ఇటీవల జరిగిన ప్రముఖ లీగ్ పోటీల్లో తన విధ్వంసకర బ్యాటింగ్‌తో మరింత గుర్తింపు సంపాదించాడు. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా అనుభవజ్ఞులైన బౌలర్లపై ఎదురుదాడికి దిగుతున్న తీరు సెలెక్టర్లను సైతం ఆకట్టుకుంది. భారీ షాట్లతో పరుగుల వరద పారిస్తూ తనలోని ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాడు. అతని ప్రతిభను గుర్తించిన భారత క్రికెట్ బోర్డు ఇప్పటికే పలు కీలక యువజన టోర్నీలకు ఎంపిక చేసే దిశగా అడుగులు వేస్తోంది. చిన్న వయసులోనే పెద్ద వేదికలపై ఆడే అవకాశాలు దక్కుతుండటంతో వైభవ్‌పై అంచనాలు మరింత పెరిగాయి. భారత క్రికెట్ భవిష్యత్తుకు అతడు ఒక కీలక ఆటగాడిగా మారే అవకాశాలు ఉన్నాయని పలువురు మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. వైభవ్ పేరు ఇప్పుడు దేశానికే పరిమితం కాలేదు. విదేశీ క్రికెట్ వర్గాల్లో కూడా అతడి ఆటతీరు గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఇంగ్లాండ్‌కు చెందిన మాజీ ఆటగాళ్లు, విశ్లేషకులు అతని బ్యాటింగ్‌ను ప్రశంసిస్తూ మాట్లాడుతున్నారు. చిన్న వయసులోనే నాణ్యమైన బౌలింగ్‌ను ధైర్యంగా ఎదుర్కొంటూ భారీ షాట్లు ఆడగలగడం అసాధారణమని వారు పేర్కొంటున్నారు. ఒక టోర్నీ మొత్తం అత్యంత వేగంగా పరుగులు సాధిస్తూ అదే స్థాయి దూకుడును కొనసాగించడం అరుదైన విషయమని కొనియాడుతున్నారు. ఇంగ్లాండ్ వంటి స్వింగ్, సీమ్‌కు అనుకూల పరిస్థితుల్లో కూడా వైభవ్ ఎలా రాణిస్తాడో చూడాలనే ఆసక్తి క్రికెట్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. విదేశీ పిచ్‌లపై అతని సాంకేతిక నైపుణ్యం ఎంతవరకు పనిచేస్తుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటివరకు అతడు చూపించిన ప్రతిభను పరిశీలిస్తే భవిష్యత్తులో అన్ని పరిస్థితులకు అనుగుణంగా ఆడగల సామర్థ్యం ఉన్న ఆటగాడిగా కనిపిస్తున్నాడని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీపై నెలకొన్న అంచనాలు చూస్తుంటే, అతడు తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడకముందే స్టార్ హోదాను సంపాదించుకున్నట్టే కనిపిస్తోంది. అయినప్పటికీ అసలు పరీక్ష ఇప్పుడు ప్రారంభం కానుంది. దేశీయ స్థాయిలో మరియు లీగ్ పోటీల్లో చూపించిన అదే స్థాయి ప్రదర్శనను అంతర్జాతీయ వేదికపై కూడా కొనసాగించగలిగితే భారత క్రికెట్‌కు మరో గొప్ప ఆటగాడు దొరికినట్టేనని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచ క్రికెట్ వర్గాల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ యువ సంచలనం రాబోయే రోజుల్లో ఎలా రాణిస్తాడో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అతడి తొలి అంతర్జాతీయ ఇన్నింగ్స్ కోసం ఇప్పుడు భారతదేశంతో పాటు ప్రపంచ క్రికెట్ ప్రేమికులందరూ ఆసక్తిగా నిరీక్షిస్తున్నారు.



# వింత రనౌట్‌తో ఆర్యా ఔట్

**దంబుల్లా, జూన్ 9 :** శ్రీలంక-ఏ జట్టుతో జరుగుతున్న తొలి వన్డే మ్యాచ్‌లో భారత-ఏ జట్టు 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ నిరాశపరిచాడు. కేవలం 12 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరగా, మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ కూడా తక్కువ స్కోరుకే అవుటయ్యాడు. ఆరంభంలో వరుస వికెట్లు కోల్పోయిన భారత్‌ను రుతురాజ్ గైక్వాడ్, ప్రియాంశ్ ఆర్యా నిలబెట్టే ప్రయత్నం చేశారు. ఇద్దరూ కలిసి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టిన సమయంలో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. 13వ ఓవర్‌లో జరిగిన ఈ సంఘటన మ్యాచ్‌లో చర్చనీయాంశంగా మారింది. స్ట్రైక్‌లో ఉన్న రుతురాజ్ గైక్వాడ్ షాట్ ఆడిన తర్వాత రెండో పరుగుకు ప్రయత్నించాడు. నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న ప్రియాంశ్ ఆర్యా కూడా మొదట రెండో పరుగుకు బయల్దేరినా, మధ్యలో తిరిగి క్రీజ్ వైపు వచ్చేశాడు. ఇదే సమయంలో రుతురాజ్ రెండో పరుగు పూర్తి చేసి తన క్రీజ్‌లోకి చేరిపోయాడు. అయితే నాన్‌స్ట్రైకర్ ఎండ్ వద్ద క్రీజ్‌లోకి చేరేందుకు ప్రయత్నించిన ప్రియాంశ్ ఆర్యాకు అనుకోని అడ్డంకి ఎదురైంది. శ్రీలంక వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెల్లా షూ అతడి బ్యాట్‌కు అడ్డుగా రావడంతో బ్యాట్ క్రీజ్‌లోకి పూర్తిగా చేరలేదు. ఆ క్షణాన్ని గమనించిన లంక ఆటగాళ్లు వెంటనే బంతిని వికెట్ల వైపు విసరగా, బ్యాట్ క్రీజ్‌లో లేకపోవడంతో అంపైర్ రనౌట్‌గా ప్రకటించాడు. ఇప్పటికే క్రీజ్‌లో స్థిరపడుతున్న ఆర్యా ఇలాంటి దురదృష్టకర రీతిలో అవుట్ కావడం భారత జట్టుకు ఎదురుదెబ్బగా మారింది. అతడి రనౌట్‌పై సామాజిక మాధ్యమాల్లో కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కొందరు అభిమానులు ఇది పూర్తిగా దురదృష్టకర ఘటన అని అభిప్రాయపడుతుండగా, మరికొందరు క్రీజ్‌లో బ్యాట్‌ను సురక్షితంగా ఉంచకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక మ్యాచ్‌లో భారత-ఏ జట్టు తరఫున రుతురాజ్ గైక్వాడ్ అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఒత్తిడిలో బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేసిన అతడు మూడు అంకెల స్కోరు నమోదు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. కెప్టెన్ తిలక్ వర్మ కూడా కీలక ఇన్నింగ్స్ ఆడి 60 పరుగులు సాధించాడు. వీరిద్దరి భాగస్వామ్యమే భారత జట్టును కష్టకాలం నుంచి గట్టెక్కించింది.

# సెంచరీతో సెలెక్టర్లకు గట్టి సమాధానం

**కొలంబో, జూన్ 9 :** అఫ్గానిస్థాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు భారత జట్టులో చోటు దక్కకపోవడంతో చర్చనీయాంశంగా మారిన రుతురాజ్ గైక్వాడ్, తన బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు. శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్ తొలి మ్యాచ్‌లో శ్రీలంక-ఏ జట్టుపై అద్భుత శతకం బాది తన సత్తా చాటుకున్నాడు. క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుతంగా ఆడుతూ జట్టును ఆదుకున్న అతడి ఇన్నింగ్స్ క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత్-ఏ జట్టుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తక్కువ స్కోరుకే ఔటవ్వగా, ప్రభ్‌సిమ్రన్ సింగ్ కూడా నిరాశపరిచాడు. మరోవైపు ప్రియాంశ్ ఆర్య రనౌట్ కావడంతో జట్టు ఒత్తిడిలో పడింది. ఈ పరిస్థితుల్లో క్రీజులో నిలిచిన రుతురాజ్ గైక్వాడ్, కెప్టెన్ తిలక్ వర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఇద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. శ్రీలంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు నడిపించారు. తిలక్ వర్మ ఒక వైపు నిలకడగా ఆడుతుండగా, రుతురాజ్ అవకాశమొచ్చినప్పుడల్లా బౌండరీలు బాదుతూ పరుగుల వేగాన్ని కొనసాగించాడు. వీరిద్దరి జోడీ నాలుగో వికెట్‌కు 150 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నమోదు చేసి జట్టును పటిష్ట స్థితికి చేర్చింది. ఈ మ్యాచ్ రుతురాజ్‌కు మరింత ప్రత్యేకమైంది. ఇది అతని వందో లిస్ట్-ఏ మ్యాచ్ కాగా, అదే మ్యాచ్‌లో శతకం సాధించి చిరస్మరణీయంగా మార్చుకున్నాడు. 112 బంతుల్లో శతకం పూర్తి చేసిన అతడు, తన లిస్ట్-ఏ కెరీర్‌లో 21వ శతకాన్ని నమోదు చేశాడు. ఒత్తిడిని తట్టుకుని ఆడిన ఈ ఇన్నింగ్స్ అతని సాంకేతిక నైపుణ్యాన్ని, మానసిక దృఢత్వాన్ని మరోసారి నిరూపించింది. విరాట్ కోహ్లీ గాయంతో అఫ్గానిస్థాన్ సిరీస్‌కు దూరమైన నేపథ్యంలో అతని స్థానానికి రుతురాజ్ సరైన ఎంపిక అయ్యేవాడని పలువురు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇన్నింగ్స్‌ను నిర్మించగల సామర్థ్యం, స్ట్రైక్‌ను చక్కగా మార్చడం, పరిస్థితులకు అనుగుణంగా ఆడగల నైపుణ్యం రుతురాజ్‌కు ఉన్నాయని వారు చెబుతున్నారు. ఈ శతకంతో సెలెక్టర్లు అతడిని పక్కన పెట్టడం సరైన నిర్ణయం కాదనే వాదనకు మరింత బలం చేకూరింది అయితే శతకం అనంతరం ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయిన రుతురాజ్, 114 బంతుల్లో 101 పరుగులు చేసి ఔటయ్యాడు. భారీ షాట్ ఆడే ప్రయత్నంలో బంతిని గాల్లోకి లేపగా, లోతైన మిడ్ వికెట్ ప్రాంతంలో ఉన్న ఫీల్డర్ అద్భుత క్యాచ్ పట్టడంతో అతని ఇన్నింగ్స్ ముగిసింది. అయినప్పటికీ అతడు ఆడిన శతక ఇన్నింగ్స్ మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# బన్నీ సినిమాలో విలన్ ఎవరూ?

**అల్లు అర్జున్ - లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్‌పై పెరుగుతున్న ఆసక్తి.. ప్రతినాయకుడి ఎంపికపై చర్చ**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్లో, దర్శకుడు కేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందనున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం నిలిచిపోయిందన్న ప్రచారానికి



ఇటీవలే చెక్ పడగా, దసరా తర్వాత షూటింగ్‌ను ప్రారంభించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతు న్నాయని తెలుస్తోంది. అయి తే ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికర అంశం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. సినిమాలో హీరో పాత్రకు ఎదురెళ్లే శక్తివంతమైన విలన్‌గా ఎవరిని ఎంపిక చేస్తారన్నదే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. లోకేష్ కనగరాజ్ చిత్రాల్లో ప్రతినాయక పాత్రలకు ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. గతంలో ఆయన తెరకెక్కించిన చిత్రాల్లో విజయ్ సేతుపతి, ఫహాద్ ఫాసిల్, సంజయ్‌దత్ వంటి నటులు విలన్ పాత్రల్లో మెప్పించారు. అలాగే సర్యా పోషించిన 'రోలెక్స్' పాత్రకు విశేష ఆదరణ లభించింది. హీరోతో సమానంగా కథను ముందుకు నడిపేలా ప్రతినాయక పాత్రలను రూపొందించడం లోకేష్ ప్రత్యేకతగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ సినిమాలో కూడా విలన్ పాత్రను అత్యంత కీలకంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే కేవలం స్టార్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఎంపికలు చేయడం కంటే, కథకు సరిపోయే నటుడిని తీసుకోవడమే కీలకమని విశ్లేషకులు అభిప్రా యపడుతున్నారు. ఇటీవల విడుదలైన కూలీ చిత్రంలో రజినీకాంత్‌తో పాటు పలువురు ప్రముఖ నటులు ఉన్నప్పటికీ, కథనం ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోవడంతో బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచిందనే చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ – లోకేష్ ప్రాజెక్ట్‌లో కథ, పాత్రల రూపకల్పనపై మరింత శ్రద్ధ పెట్టనున్నట్లు సమాచారం. అయితే విలన్ పాత్రకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో బన్నీకి ఎదురెళ్లే ఆ పవర్‌ఫుల్ ప్రతినాయకుడు ఎవరనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరుగుతోంది.

# 'పెద్ది' వివాదాస్పద సన్నివేశాల తొలగింపు

**అపార్థాలకు దారితీసిన సన్నివేశాలను తీసేశాం: దర్శకుడు బుచ్చిబాబు**



బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'పెద్ది' చిత్రంలో వివాదానికి కారణమైన కొన్ని సన్నివేశాలను తొలగి ంచినట్లు దర్శకుడు బుచ్చిబాబు సనా వెల్లడిం చారు. సినిమా విడుదలైన తర్వాత సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమైన విమర్శలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో బుచ్చి బాబు మాట్లాడు తూ, చిత్రంలోని జాన్వీకపూర్ పాత్రకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు ప్రేక్షకుల్లో అపార్థాలకు దారితీశాయని చెప్పారు. చాలా మంది ప్రేక్షకులు ఆ పాత్రను తప్పుగా అర్థం చేసుకోవడంతో పాటు, కథకు ఆమె పాత్ర అవసరం లేదని వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. ''నా గత చిత్రం ఉప్పెనతో పోలిస్తే 'పెద్ది' కథను పూర్తిగా భిన్నంగా రూపొందించాను. కొండ ప్రాంతంలోని మారు మూల గ్రామంలో పెరిగిన వ్యక్తిగా పెద్ది పాత్రను తీర్చిదిద్దాం. ప్రారంభంలో అతడిలోని మొరటుతనాన్ని చూపించి, కథ చివర్లో అతడి వ్యక్తిత్వంలో మార్పు రావాలని భావించాం. ఆ మార్పుకు ప్రేమ కూడా ఒక కారణంగా నిలవాలనే ఉద్దేశంతో కథానాయిక పాత్రను రాశాను. అయితే, స్క్రీన్‌ప్లేలోని కొన్ని సన్నివే శాలు ప్రేక్షకులకు భిన్నమైన భావన కలిగిం చాయి. అందుకే విమర్శలను స్వీకరించి, ఆ సన్నివే శాలను గుర్తించి చిత్రం నుంచి తొలగించాం'' అని బుచ్చిబాబు వివరించారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో రామ్‌చరణ్ ప్రధాన పాత్రలో నటించగా, జాన్వీ కపూర్ అచ్చియమ్మ పాత్రలో కనిపించారు. అయితే ఆమె పాత్రను గ్లామర్‌కే పరిమితం చేశారంటూ, పరిచయ సన్నివేశాల్లో ఆమెను చూపిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమయ్యాయి.



# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో రష్మిక?

ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు ఎంఎస్ సుబ్బలక్ష్మి జీవిత కథ ఆధారంగా రూపొందనున్న బయోపిక్‌కు సంబంధించిన వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌లో ప్రధాన పాత్ర కోసం పలువురు నటీమణుల పేర్లు వినిపించగా, మొదటగా సాయిపల్లవి, రుక్మిణి వసంత్ పేర్లు ప్రధానంగా చర్చకు వచ్చాయి. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ కథను ప్రముఖ నటి రష్మిక మందన్నకు వినిపించినట్లు తెలుస్తోంది. చిత్ర బృందం రష్మికతో ఇప్పటికే కథా చర్చలు జరిపినట్లు, అలాగే ఎంఎస్ సుబ్బులక్ష్మి పాత్ర కోసం ప్రత్యేకంగా లుక్ టెస్ట్ కూడా నిర్వహించినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌లో ఆమె నటించనున్నారా లేదా అనే విషయంపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఇక ప్రస్తుతం రష్మిక చేతిలో 'మైసా', 'రణబాలి', 'కాక్‌టెయిల్ 2' తదితర చిత్రాలు ఉన్నాయి. మరోవైపు ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించే ఈ బయోపిక్‌పై ప్రేక్షకుల్లోనూ, సంగీతాభిమానుల్లోనూ భారీ ఆసక్తి నెలకొంది.



# బాలయ్య బర్త్‌డే ట్రీట్‌కు టైమ్ ఫిక్స్



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ప్రత్యేక కానుక అందించేందుకు సిద్ధమైన NBK111 చిత్ర బృందం ఆ ట్రీట్ విడుదల సమయాన్ని అధికారికంగా ప్రకటించింది. జూన్ 10న బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని చిత్రానికి సంబంధించిన కీలక అప్డేట్‌ను విడుదల చేయను న్నట్లు వెల్లడించింది. 'ఒక కొత్త శకానికి నాంది' అనే క్యాప్షన్‌తో బాలయ్య ఎంట్రీని పరిచయం చేస్తూ విడుదల చేయనున్న ఈ ప్రత్యేక ట్రీట్‌ను జూన్ 10న సాయంత్రం 5.40 గంటలకు రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్ అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచింది. అలాగే 'నో మోర్ వింటేజ్.. ఓన్లీ న్యూ ఏజ్' అనే ట్యాగ్‌లైన్‌తో చిత్ర బృందం ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పుతోంది. ఈ పోస్టర్‌తో సినిమా కొత్త తరహా మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చినట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ తమన్ సంగీతం అందిస్తుండగా, వ్రిద్ధి సినిమాస్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో, బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా విడుదల కానున్న ఈ ట్రీట్ ఎలాంటి సంచలనం సృష్టిస్తుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# కష్టకాలంలో అండగా నిలిచిన నటి

సహజ నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న సాయి పల్లవి మరోసారి తన మంచి మనసుతో అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నారు. ఈసారి ఆమె చేసిన సహాయాన్ని గుర్తుచేసుకుంటూ నటి అనుపమా పరమేశ్వరన్ సోషల్ మీడియాలో చేసిన భావోద్వేగ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తన జీవితంలో 2021 సంవత్సరం అత్యం త క్లిష్టమైన కాలంగా నిలిచిందని అనుపమ వెల్ల డించారు. ఆ సమయంలో తీవ్ర మానసిక ఒత్తిడి ని ఎదుర్కొంటున్నప్పుడు తన బాధను సాయి పల్లవితో పంచుకున్నట్లు తెలిపారు. ఆ సంద ర్భంలో సాయిపల్లవి ఎంతో ఆప్యాయంగా తన వద్ద ఉన్న వాటర్ కలర్స్‌ను బహుమతిగా ఇచ్చిందని, అదే తనలోని కొత్త ప్రతిభను వెలికితీయడానికి కారణమైందని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచే నాకు రంగులంటే ఇష్టం. కానీ పెయింటింగ్ వేయడం రాదు. కష్టకాలం లో నేను ఎదుర్కొంటున్న పరిస్థితులను సాయి పల్లవితో పంచుకున్నప్పుడు, ఆమె నాకు వాటర్ కలర్స్ ఇచ్చింది. ఆ చిన్న ప్రోత్సాహమే నన్ను పెయింటింగ్ వైపు మళ్లించింది. నాలో ఇలాంటి ప్రతిభ ఉందని నాకు కూడా తెలియదు. నా జీవితంలోని కొత్త కోణాన్ని పరిచయం చేసినందుకు సాయిపల్లవికి ఎప్పటికీ కృతజ్ఞురాలిని'' అని అనుపమ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అలాగే గత ఏడాది తాను వేసిన పెయింటింగ్స్‌ను తన తల్లిదండ్రులు రహస్యంగా సేకరించి, అందంగా ఫ్రేమ్ చేయించి తన స్టూడియో గోడలపై అలంకరించి సర్‌ప్రైజ్ ఇచ్చారని వెల్లడించారు. ''నా జీవితంలోని ఒక చేదు జ్ఞాపకం నేడు అందమైన కళాత్మక జ్ఞాపకాల ప్రపంచంగా మారింది. అది ఎంతో ప్రత్యేకమైన అనుభూతి'' అని ఆమె పేర్కొన్నారు. అనుపమ చేసిన ఈ పోస్ట్‌కు సోషల్ మీడియాలో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సాయిపల్లవి అభిమానులు ఆమె మంచి మనసును ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు. సహనటులకు అండగా నిలుస్తూ, వారి జీవితాల్లో సానుకూల మార్పుకు కారణమవుతున్న సాయిపల్లవి వ్యక్తిత్వంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా, కెరీర్ పరంగా కూడా సాయిపల్లవి వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతుండగా, ఆమె వ్యక్తిత్వం, సరళత కారణంగా అభిమానుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.





# బేబీ డూ డై డూ టీజర్ విడుదల

**దేశీ హిట్ ఉమెన్‌గా హ్యూమా ఖురేషీ.. సస్పెన్స్ థ్రిల్లర్‌పై పెరిగిన ఆసక్తి**

బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్రలో నటిస్తున్న మిస్టరీ థ్రిల్లర్ చిత్రం 'బేబీ డూ డై డూ' టీజర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. సస్పెన్స్, థ్రిల్, డార్క్ హ్యూమర్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి నచికెన్‌ట్ సమంత్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌లో హ్యూమా ఖురేషీ 'బేబీ కర్‌మార్కర్' అనే ఆసక్తికరమైన పాత్రలో కనిపించి ఆకట్టుకున్నారు. భారతీయ సినీ తెరపై తొలి 'దేశీ హిట్ ఉమెన్'గా ఆమె పాత్రను తీర్చిదిద్దినట్లు టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. టీజర్‌లో మిస్టరీ, ఉత్కంఠభరిత సన్నివేశాలతో పాటు డార్క్ హ్యూమర్‌కు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. కథ, పాత్రల రూపకల్ప న, విజువల్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ప్రేక్షకులను ఒక కొత్త ప్రపం చంలోకి తీసుకెళ్లేలా ఈ చిత్రాన్ని రూపొం దించినట్లు మేకర్స్ వెల్లడించారు. కాగా, ఈ చిత్రాన్ని నటుడు సాక్విబ్ సలీం నిర్మిస్తున్నారు. ఇప్పటికే టీజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తుండగా, 'బేబీ డూ డై డూ' చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. మిస్టరీ థ్రిల్లర్ చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com